www.bhadradrinews.com

# భద్రాద్రి న్యూస్

తెలుగు దినపత్రిక

Bhadradrinews Telugu Daily

హైదరాబాద్, సంపుటి : 4 సంచిక: 214, శుక్రవారం 4-9-2026 ఎడిటర్ : చెంగపొంగు సైదులు పేజీలు : 6 వేల : 5

Published from Khammam,Circulated by Hyderabad, Karimnagar, adilabad, Nizamabad, Warangal, Nalgonda, Mahabubnagar, Khammam

పట్టుదలతో అనుకున్న లక్ష్యాలను సాధించవచ్చు







# మంత్రివర్గం నుంచి కొండా సురేఖ ఔట్..

## తక్షణం కొండా సురేఖను బర్తరఫ్ చేయాలంటూ లేఖ పంపిన సీఎం

## రాజీనామాకు కొండా సురేఖ ససేమిరా అనడంతో బర్తరఫ్ నిర్ణయం

## సీఎం రేవంత్‌రెడ్డి సిఫార్సును ఆమోదించిన గవర్నర్ శివ్‌ప్రతాప్

**హైదరాబాద్, సెప్టెంబర్ 3:**

రాష్ట్ర కాంగ్రెస్‌లో కొద్దిరోజులుగా నలుగుతున్న కొండా సురేఖ ఎపిసోడ్‌కు తెరపడింది. కొండా సురేఖను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి గవర్నర్ శివ్ ప్రసాద్ శుక్లాకు కొండా సురేఖను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని లేఖను పంపడంతో ఆయన ఆమోదం తెలిపారు. దీంతో మంత్రి కొండా సురేఖను కేబినెట్ నుంచి తొలగించినట్లైంది. అంతకు ముందు కొండా సురేఖను మంత్రి పదవి నుంచి తొలగించేందుకు ఏఐసీసీ క్లియరెన్స్ ఇచ్చింది.

రాజీనామాకు ససేమిరా : దీంతో తక్షణమే కొండా సురేఖను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలంటూ సీఎం రేవంత్ రెడ్డి గవర్నర్‌కు పంపిన లేఖలో స్పష్టం చేశారు. కొండా సురేఖను మంత్రి పదవికి రాజీనామా చేయాలని కోరినా అందుకు ఆమె నిరాకరించింది. దీంతో బర్తరఫ్ చేయాలని ముఖ్యమంత్రి లేఖ రాయడం, దానికి గవర్నర్ ఆమోదంతో పార్టీలో జరిగిన నాటకీయ పరిణామాలకు తెరపడినట్లైంది.

పీసీసీ సీరియస్ : పరకాల టికెట్ ఆశిస్తున్న కొండా సుస్మిత చేసిన వ్యాఖ్యలు.. కొండా సురేఖను మంత్రివర్గం నుంచి తప్పించేందుకు కారణమయ్యాయనే హస్తం నేతలు అంటున్నారు.



పరకాల సిట్టింగ్ మీూా రేవూరి ప్రకాశ్ రెడ్డికే మళ్లీ టికెట్ ఇస్తానన్న సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటనను సుస్మిత గత నెల 19న కొండా సురేఖ పుట్టిన రోజు వేడుకల్లో బహిరంగంగా సవాల్ చేశారు. రేవంత్‌రెడ్డితో పాటు కాంగ్రెస్‌లోని సీనియర్ నేతలపై అవినీతి ఆరోపణలు చేశారు. ఆ అంశంపై పలువురు కాంగ్రెస్ నేతలు పీసీసీకి ఫిర్యాదు చేశారు. పీసీసీ సూచన మేరకు మల్లు రవి నేతృత్వంలోని క్రమశిక్షణా కమిటీ ఆ విషయంపై దృష్టిసారించింది.

వాదనలు, వివరణలు : సుస్మిత వ్యాఖ్యలపై పూరిస్థాయిలో విచారణ చేయాలని మల్లు రవిని, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ ఆదేశించగా కొండా సురేఖకు షోకాజ్ నోటీసులు ఇచ్చారు. సుస్మిత వ్యాఖ్యలపై వివరణ తీసుకున్నారు. తన కుమార్తె స్వతంత్ర మహిళ అని పేర్కొన్న

..మిగతా 2లో

హైకమాండ్‌ను రేవంత్ రెడ్డి బ్లాక్‌మెయిల్ చేసి

# నన్ను బర్తరఫ్ చేయించారు

## కొండా సురేఖ

## తన కుమార్తె వ్యాఖ్యలకు నన్నెలా బాధ్యురాలిని చేస్తారని నిలదీత

## రాజీనామా చేయమని నన్నెవరూ అడగలేదని వివరణ

## అధిష్ఠానానికి ఇచ్చిన లేఖను మీడియాకు ఇచ్చిన కొండా సురేఖ

**హైదరాబాద్, సెప్టెంబర్ 3:**




మంత్రివర్గం నుంచి తనను బర్తరఫ్ చేయాలన్న నిర్ణయంపై కొండా సురేఖ స్పందించారు. తనని మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయడాన్ని ఖండించారు. నిర్ణయానికి ముందు తన వివరణ తీసుకోవాల్సిందని తెలిపారు. తన కుమార్తె వ్యాఖ్యలకు తననెలా బాధ్యురాలిని చేస్తారని ప్రశ్నించారు. తన కుమార్తె స్వతంత్ర మహిళ అని, ఆమె వ్యాఖ్యలు ఆమెవేనని పేర్కొన్నారు. మీడియాకు ఇచ్చిన నోట్‌లో ఊరు, పేరు లేదు. రేవంత్ రెడ్డి పట్టుబట్టి : ఉరిశిక్ష పడిన ఖైదీని కూడా చివరి కోరిక అడుగుతారన్న కొండా సురేఖ తనను మాత్రం ఏ వివరణ అడగకుండానే తొలగించారని, తనను ఇలా ఏకపక్షంగా తొలగించటం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. తనను తొలగించడం అధిష్ఠానానికి కూడా ఇష్టం లేదన్నారు. సీఎం రేవంత్ రెడ్డి పట్టుబట్టి తనని బర్తరఫ్ చేయిస్తున్నారని, 'బర్తరఫ్ చేస్తారా? నన్ను వెళ్లిపోమ్మంటారా'

..మిగతా 2లో

# కేబినేట్‌లో బీసీ వర్గానికి ప్రాధాన్యత

2లో..

## సురేఖ, చిన్నారెడ్డి స్థానంలో కొత్త వారికి చాన్స్

## ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్ గా గద్వాల విజయ లక్ష్మి.. రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా నెరెళ్ల శారద

## కుడా చైర్ పర్సన్ గా గుండు సుధారాణికి చాన్స్... బీసీ వర్గానికి చెందిన మహిళలకు అవకాశం

దేశభక్తిలో మోదీ, అమిత్ షాలకు ఒవైసీ బ్రదర్స్

# తక్కువేమీ కాదు

## ఎంఐఎం దేశ వ్యతిరేకమనేది దుష్ప్రచారమన్న రేవంత్

## ఓల్డ్‌సిటీ అభివృద్ధిపై అసద్, అక్బర్‌తో చర్చించానని వెల్లడి

## అసద్ సూచించిన అభివృద్ధి పనులను వెంటనే మంజూరు చేయాలని ఆదేశం

## పాతబస్తీ పేదలకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తామని హామీ

## హైదరాబాద్‌లో లక్ష ఇళ్లు నిర్మించడమే లక్ష్యమని వెల్లడి



**హైదరాబాద్, సెప్టెంబర్ 3 :**

ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీపై సీఎం రేవంత్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. దేశభక్తి విషయంలో ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షాలకు అసదుద్దీన్ ఒవైసీ ఏమీ తక్కువ కాదన్నారు. అసద్, ఎంఐఎం దేశానికి వ్యతిరేకమంటూ జరుగుతున్న ప్రచారం దుష్ప్రచారం మాత్రమేనని చెప్పారు. సైదాబాద్ స్టీల్ బ్రిడ్జిని సీఎం గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన.. అసదుద్దీన్‌కు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు ఉందన్నారు. ఓల్డ్‌సిటీ

..మిగతా 2లో

# ఆదికి అదృష్టం వరించేనా..?

## సురేఖ ఔట్..మంత్రి బెర్త్‌పై ఆది శ్రీనివాస్ పేరు

## బీసీ కోటా.. విధేయత.. విప్ అనుభవం.. కలిసి వస్తాయా?

## వేములవాడకు తొలిసారి మంత్రి పదవిపై మళ్లీ జోరుగా చర్చ

**వేములవాడ,సెప్టెంబర్3:**

తెలంగాణ రాజకీయాల్లో అనూహ్య పరిణామంచోటుచేసుకుంది. మంత్రి కొండా సురేఖను మంత్రివర్గం నుంచి తొలగిస్తూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు గవర్నర్‌కు సిఫార్సు చేశారు. దీంతో ఖాళీ కానున్న మంత్రి పదవిని ఎవరితో భర్తీ చేస్తారన్న చర్చ ఇప్పుడు కాంగ్రెస్ వర్గాల్లో మొదలైంది. ఈ క్రమంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేరు మరోసారి తెరపైకి వచ్చింది.

సురేఖ స్థానంలో ఆది?మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణపై ఏడాదికాలంగా రకరకాల ప్రచారాలు కొనసాగుతున్నాయి. ప్రతి సందర్భంలోనూ ఆది శ్రీనివాస్ పేరు మంత్రి రేసులో వినిపిస్తూనే ఉంది. అయితే అధిష్ఠానం నుంచి స్పష్టమైన నిర్ణయం లేకపోవడంతో అది ముందుకు సాగలేదు. తాజాగా సురేఖను మంత్రివర్గం నుంచి తప్పించడంతో.. ఖాళీ అయ్యే స్థానాన్ని బీసీ సామాజిక వర్గంతో భర్తీ చేయాలన్న సమీకరణం తెరపైకి వస్తే ఆది శ్రీనివాస్‌కు అవకాశం దక్కవచ్చన్న చర్చ మళ్లీ ఊపందుకుంది.

**బీసీ సమీకరణమే కీలకమా?**

మంత్రివర్గంలో మార్పులు జరిగే సమయంలో



సామాజిక, ప్రాంతీయ సమీకరణాలు కీలకంగా మారుతాయి. సురేఖ స్థానంలో అదే విస్తృత సామాజిక సమీకరణాన్ని కొనసాగించాలన్న ఆలోచన ఉంటే.. మున్నూరు కాపు బీసీ వర్గానికి చెందిన ఆది శ్రీనివాస్ పేరు సహజంగానే పరిశీలనలోకి వచ్చే అవకాశం ఉ ఒదని పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఇప్పటికే ప్రభుత్వ విప్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న ఆయనకు మంత్రి పదవి ఇవ్వడం ద్వారా బీసీ ప్రాతినిధ్యంతో పాటు ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు మరో బెర్త్ కల్పించినట్లవుతుందన్న లెక్కలు వినిపిస్తున్నాయి.

**ఏడాదిగా వినిపిస్తున్న పేరు**

ఆది శ్రీనివాస్‌కు మంత్రి పదవి దక్కుతుందన్న ప్రచారం ఇప్పటిది కాదు. మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణపై చర్చ జరిగిన ప్రతిసారీ ఆయన పేరు ప్రముఖంగా వినిపించింది. అయితే రాజకీయ సమీకరణాలు, అధిష్ఠానం నిర్ణయాలు, ఇతర ఆశావహుల పోటీతో ఈ అంశం వాయిదా పడుతూ వచ్చింది. ఇప్పుడు మాత్రం సురేఖ తొలగింపుతో ఖాళీ ఏర్పడటంతో ఆది పేరు మరోసారి చర్చకు వచ్చింది.

**పార్టీ కోసం.. కష్టకాలంలోనూ**

ఆది శ్రీనివాస్ సుదీర్ఘకాలంగా కాంగ్రెస్‌తో అనుబంధాన్ని కొనసాగిస్తున్న నాయకుడిగా గుర్తింపు పొందారు. పార్టీ కష్టకాలంలోనూ కాంగ్రెస్ జెండాను వీడకుండా పనిచేశారన్న పేరు ఆయనకు ఉంది. 2009 నుంచి వేములవాడ అసెంబ్లీ స్థానంలో పోటీ చేస్తూ వచ్చిన ఆయన.. 2023 ఎన్నికల్లో తొలిసారి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన అనంతరం ప్రభుత్వ విప్‌గా కీలక

..మిగతా 5లో

# జెలెన్‌స్కీతో జైశంకర్ కీలక భేటీ

## యుద్ధం ముగింపుపై ప్రధానంగా చర్చ

## భారత్‌కు కృతజ్ఞతలు తెలిపిన జెలెన్‌స్కీ

## బ్లాక్ సీ పరిస్థితిపైనా చర్చ

## శాంతి ప్రక్రియలో భారత్ పాత్రపై ఉక్రెయిన్ ఆశలు

2లో..

# హైకమాండ్‌ను రేవంత్ రెడ్డి బ్లాక్‌మెయిల్ చేసి నన్ను బర్తరఫ్ చేయించారు

మొదటి పేజీ తరువాయి...

అని అధిష్ఠానాన్ని బ్లాక్‌మెయిల్ చేశారని ఆమె ఆరోపించారు. హైకమాండ్‌ను రేవంత్ రెడ్డి బ్లాక్‌మెయిల్ చేసి నన్ను బర్తరఫ్ చేయించారు : కొండా సురేఖ తన మీద, తన మాజీ ఓఎస్డీ మీద కుట్రలు చేస్తున్నారని, దీని వెనక వేం నరేందర్‌రెడ్డి, పొంగులేటి, కొండల్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, మరికొందరు ఉన్నారన్నారు. అందరూ కలిసి కావాలని కక్షగట్టి నన్ను, సుమంత్ కుటుంబాన్ని వేధించారని విమర్శించారు. సుమంత్‌పై పెట్టిన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

"సీఎం రేవంత్‌రెడ్డి, పార్టీపై నేను ఎలాంటి విమర్శలు చేయలేదు. ఒకప్పుడు మల్లు రవి కూడా ఒకప్పుడు కాంగ్రెస్‌ను తిట్టారు. మాజీ సీఎం రోశయ్య, జైపాల్‌రెడ్డి కూడా ఇందిరాగాంధీని తిట్టారు. నా కుమార్తె వ్యాఖ్యలకు నాపై చర్యలు తీసుకోవటం బాధాకరం. రూ.50 కోట్లు ఇచ్చి పీసీసీ పదవి తెచ్చుకున్నారని తిట్టినవారికి పదువులు ఇచ్చారు. నన్ను తొలగించినందుకు ఏమీ బాధపడటం లేదు. కారణం చెప్పకుండా తొలగించడమే చాలా బాధాకరం. బీసీ మహిళను ఇలా అవమానకరంగా తొలగించటం బాధాకరం. కారణం చెప్పకుండా తొలగించడాన్ని జీర్ణించుకోలేకపోతున్నా. కారణం చెప్పాల్సిన బాధ్యత సీఎం, ఏఐసీసీపై ఉంది" – కొండా సురేఖ

మంత్రిగా తనకు ఎలాంటి అధికారాలు లేకుండా చేశారని, తన ప్రమేయం లేకుండానే తన శాఖలో నిర్ణయాలు తీసుకున్నారని ఆరోపించారు. తనకు తెలియకుండా తన ఓఎస్డీ సుమంత్‌ను తప్పించారని, అభివృద్ధి విషయంలో తన నియోజకవర్గంపై వివక్ష చూపారని విమర్శించారు. తన శాఖలోని అంశాలపై కడియం శ్రీహరి జోక్యం చేసుకున్నారని, తన శాఖలోని అధికారులతో కడియం సమీక్షలు నిర్వహించారని తెలిపారు.

ప్రజల్లో వ్యతిరేకత ఉంది : మంత్రులందరూ సంతోషంగా ఉన్నారా? గుండెల మీద చెయ్యి వేసుకుని చెప్పాలని సురేఖ కోరారు. మంత్రులు, ఎమ్మెల్యేలు ఎవరూ సంతోషంగా లేరనే విషయం అందరికీ తెలుసనని తెలిపారు. ఇప్పటికైనా అందరూ బయటికి వచ్చి ధైర్యంగా మాట్లాడాలని సూచించారు. ప్రజలకు సేవ, అభివృద్ధి చేయలేకపోతున్నామనే బాధ అందరిలో ఉందని, పనుల జరగాలంటే ఎవరివద్దకు వెళ్లాలో తెలియని స్థితిలో ఎమ్మెల్యేలు ఉన్నారని ఆరోపించారు. ఇస్తామన్న హామీలు నెరవేర్చకపోవటం వల్ల ప్రజల్లో వ్యతిరేకత ఉందని స్పష్టం చేశారు.

ఎమ్మెల్యేగా కొనసాగుతా? : క్షేత్రస్థాయి పరిస్థితిపై ప్రభుత్వం సర్వే చేయించుకుంటే మంచిదని సూచించారు. తాను పునరాలోచించుకోమని చెప్పనని, పార్టీ తీరు మారాల్సిన అవసరం ఉందని తెలిపారు. మళ్లీ కాంగ్రెస్ పార్టీ గెలవాలంటే చాలా మార్పులు చేసుకోవాలని, రేవంత్ రెడ్డి ఏకపక్షంగా వ్యవహరించడం సరికాదని హితవు పలికారు. తనవైపు ఒక వేలు చూపితే రేవంత్‌రెడ్డి వైపు నాలుగువేళ్లు చూపుతాయని ఎద్దేవా చేశారు. ప్లాన్-బిపై ఇంకా ఏమీ ఆలోచించుకోలేదని ఎమ్మెల్యేగా కొనసాగుతానని, కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసే ఆలోచన లేదని స్పష్టం చేశారు.

ఇంకా ఆలోచించుకోలేదు : తన కుమార్తె వ్యాఖ్యలను తాను ఖండించాల్సిన అవసరం లేదన్న సురేఖ తన కుమార్తె వ్యక్తిగత అభిప్రాయాన్ని తప్పుపట్టే అధికారం తనకు లేదని స్పష్టం చేశారు. అధిష్ఠానానికి తాను ఇచ్చిన లేఖను మీడియాకు ఇస్తున్నానని, భవిష్యత్ కార్యాచరణపై ఇంకా ఆలోచించుకోలేదని తెలిపారు. జగ్గారెడ్డి, రాజగోపాల్‌రెడ్డి వ్యాఖ్యలపై ఏం నిర్ణయం తీసుకున్నారని ఆమె నిలదీశారు.

రేవంత్ రెడ్డి ఆత్మపరిశీలన చేసుకోవాలి : తాను తప్పు చేయలేదని, తనకు పశ్చాత్తాపం లేదని కొండా సురేఖ వెల్లడించారు. సీఎం రేవంత్ రెడ్డి ఆత్మపరిశీలన చేసుకోవాలని హితవు పలికారు. వైఎస్ఆర్ తర్వాత రేవంత్ రెడ్డినే ఎక్కువ అభిమానించానని, రేవంత్ రెడ్డి పీసీసీ అధ్యక్షుడు, సీఎం కావాలని తానే ముందు కోరుకున్నానని పేర్కొన్నారు.

సంతోషంగా ఉంది : తనపై కక్షపూరితంగా చర్యలు తీసుకున్నారని భావిస్తున్నానన్న కొండా సురేఖ తన వల్ల ముగ్గురు బీసీ మహిళలకు పదవులు రావటం సంతోషకరమని తెలిపారు. తన కోసం చిన్నారెడ్డిపై వేటు వేయటం సరికాదని అభిప్రాయపడ్డారు.

# జెలెన్‌స్కీతో జైశంకర్ కీలక భేటీ

**యుద్ధం ముగింపుపై ప్రధానంగా చర్చ**

**భారత్‌కు కృతజ్ఞతలు తెలిపిన జెలెన్‌స్కీ**

**బ్లాక్ సీ పరిస్థితిపైనా చర్చ**

**శాంతి ప్రక్రియలో భారత్ పాత్రపై ఉక్రెయిన్ ఆశలు**

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 3 :**

ఉక్రెయిన్‌లో పర్యటిస్తున్న భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్.. అధ్యక్షుడు వొలోదిమిర్ జెలెన్‌స్కీతో భేటీ అయ్యారు. భారత్-ఉక్రెయిన్ ద్వైపాక్షిక సంబంధాల బలోపేతంతో పాటు రష్యా-ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు పలికే మార్గాలపై ఇరువురు నేతలు చర్చించారు. ఈ సందర్భంగా ఉక్రెయిన్ అధ్యక్షుడు భారత్‌కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. జైశంకర్‌తో భేటీ అనంతరం జెలెన్‌స్కీ 'ఎక్స్'లో స్పందించారు. "ఈ అన్యాయమైన యుద్ధానికి ముగింపు పలకాలన్న భారత ఆకాంక్షకు కృతజ్ఞతలు. యుద్ధం ఆపి శాంతిని పునరుద్ధరించాలన్నదే భారత స్పష్టమైన వైఖరి" అని పేర్కొన్నారు.

నల్ల సముద్రం ప్రాంతంలో పరిస్థితులు, పౌర నౌకాయానానికి ఎదురవుతున్న ముప్పుపైనా చర్చించినట్లు జెలెన్‌స్కీ తెలిపారు. ఆహారం అవసరమైన ప్రాంతాలకు సరఫరాలు అడ్డుకోవడం ఏమాత్రం ఆమోదయోగ్యం కాదన్నారు. తమ నౌకాశ్రయాలు, ధాన్యం కారిడార్, సరఫరాలను అడ్డుకోవడం ప్రపంచ సంబంధాల్లో తీవ్ర అంతరాయాలకు కారణమవుతోందని ఆరోపించారు.

జైశంకర్ కూడా జెలెన్‌స్కీతో భేటీ వివరాలను 'ఎక్స్'లో వెల్లడించారు. ఉక్రెయిన్ విదేశాంగ మంత్రి ఆండ్రి సిబిహాతో జరిగిన చర్చలను జెలెన్‌స్కీకి వివరించినట్లు చెప్పారు. ద్వైపాక్షిక సహకారాన్ని మరింత పెంచుకోవడంతో పాటు యుద్ధానికి ముగింపు పలికే మార్గాలపైనే ప్రధానంగా చర్చ జరిగినట్లు తెలిపారు.

ఇదిలా ఉండగా.. ఉక్రెయిన్ విదేశాంగ మంత్రి సిబిహాతో జైశంకర్ ప్రత్యేకంగా భేటీ అయ్యారు. యుద్ధం ముగింపు, బ్లాక్ సీ భద్రత, నౌకాయాన స్వేచ్ఛ, ప్రపంచ ఆహార భద్రత అంశాలపై చర్చించారు. శాంతి ప్రక్రియలో భారత్ మరింత చురుకైన పాత్ర పోషించాలని ఉక్రెయిన్ కోరింది.

భారత్-ఉక్రెయిన్ మధ్య వాణిజ్యం ప్రస్తుతం 2.6 బిలియన్ డాలర్లుగా ఉందని సిబిహా తెలిపారు. వాణిజ్యం, పెట్టుబడులు, పునర్నిర్మాణంలో భారత కంపెనీల భాగస్వామ్యాన్ని పెంచుకోవాలని ఉక్రెయిన్ భావిస్తోంది. ఇంధనం, మౌలిక వసతులు, రవాణా, వ్యవసాయం, ఔషధాలు, డిజిటలైజేషన్, ఇంజినీరింగ్ రంగాల్లో సహకారానికి అవకాశాలున్నాయని చెప్పారు.

జైశంకర్ ఉక్రెయిన్ పర్యటన మరో విషయంలోనూ ప్రత్యేకంగా నిలిచింది. భారత విదేశాంగ మంత్రి ఉక్రెయిన్‌కు స్వతంత్ర ద్వైపాక్షిక పర్యటన చేయడం ఇదే తొలిసారి.

# తుంటను ఎత్తేసి.. మొద్దును ఎత్తుకున్న శాస్త్రం..!

**వెయ్యి రోజుల పాలనపై అధికార ప్రతిపక్షాల పోటాపోటీ.. సవాళ్లు, విమర్శలతో రాజకీయ వేడి..**

**నిన్నటి బీఆర్ఎస్‌పై నేటి కాంగ్రెస్.. నేటి కాంగ్రెస్‌పై నిన్నటి బీఆర్ఎస్.. ప్రజలు మాత్రం ఎవరి మాట నమ్మాలో తేల్చుకోలేక...!**

**గద్వాల , సెప్టెంబర్ 3:**

తెలంగాణ రాజకీయాల్లో ప్రస్తుతం ఓ ఆసక్తికరమైన రాజకీయ దృశ్యం కనిపిస్తోంది. ఒకవైపు కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల ప్రజా పాలన పేరుతో సంబరాలు నిర్వహిస్తూ తమ ప్రభుత్వం సాధించిన విజయాలను ప్రజలకు వివరిస్తోంది. మరోవైపు ప్రతిపక్ష బీఆర్ఎస్ అదే వెయ్యి రోజుల పాలనను వైఫల్యాల పాలనగా అభివర్ణిస్తూ నిరసనలు, కార్యక్రమాలు చేపడుతోంది. ఇద్దరి మాటల్లోనూ ప్రజలే కేంద్రబిందువు. ఇద్దరి విమర్శల్లోనూ ప్రజల సమస్యలే అంశం. ఇద్దరి సభల్లోనూ హామీలే ప్రధాన అస్త్రం. కానీ ప్రజల్లో మాత్రం మరో ప్రశ్న వినిపిస్తోంది. నిన్న ఒకరిని నమ్మాం.. నేడు మరొకరిని నమ్మాం.. ఇక రేపు ఎవరిని నమ్మాలి..? తుంటా.. మొద్దా.? ప్రజల తీర్పే తుది.! రాజకీయాలను వ్యంగ్యంగా పరిశీలిస్తే.. గత బీఆర్ఎస్ పాలనను 'తుంట'గా, ప్రస్తుత కాంగ్రెస్ పాలనను 'మొద్దు'గా పోల్చుకునే పరిస్థితి కనిపిస్తోందని రాజకీయ పరిశీలకులు అంటున్నారు. ఒకప్పుడు బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ ప్రతిపక్షంగా ఉండి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టింది. ఇప్పుడు కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో బీఆర్ఎస్ అదే పాత్రను పోషిస్తోంది. అప్పుడు కాంగ్రెస్ చేసిన విమర్శలను ఇప్పుడు బీఆర్ఎస్ చేస్తోంది. ఇప్పుడు బీఆర్ఎస్ చేస్తున్న విమర్శలకు అప్పట్లో కాంగ్రెస్ చేసిన సమాధానాలే తరహాలో కాంగ్రెస్ స్పందిస్తోంది. పార్టీలు మారాయి.. అధికార కుర్చీ మారింది.. కానీ రాజకీయ విమర్శల తీరు మాత్రం పెద్దగా మారలేదనే భావన ప్రజల్లో వ్యక్తమవుతోంది.

**వెయ్యి రోజులు.. రెండు వాదనలు....!**

కాంగ్రెస్ నాయకులు మాత్రం వెయ్యి రోజుల పాలనను విజయవంతమైన ప్రజా పాలనగా అభివర్ణిస్తున్నారు. ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, రైతులు, మహిళలు, యువతకు చేపట్టిన కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు.

మరోవైపు బీఆర్ఎస్ నాయకత్వం మాత్రం వెయ్యి రోజుల పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలు ఏమయ్యాయి.? అంటూ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తోంది. రైతులు, నిరుద్యోగులు, మహిళలు, యువత, పేదల సమస్యలను ప్రస్తావిస్తూ ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తోంది.

ఇలా అధికార పక్షం వెయ్యి రోజుల విజయోత్సవం అంటుంటే.. ప్రతిపక్షం వెయ్యి రోజుల మోసం అంటూ ప్రజల్లోకి వెళ్తోంది.

**సవాళ్ల ఘనం.. నిజం ఎంత...?**

రాజకీయ వేదికలపై సవాళ్లు విసురుకోవడం కొత్తేమీ కాదు. అయితే ఇప్పుడు రెండు ప్రధాన రాజకీయ శిబిరాల మధ్య మాటల యుద్ధం మరింత ముదురుతోంది. మేము ఇది చేశాం,

మీరు అది చేయలేదు, మా హామీలు అమలు చేశాం, మీ హామీలు ఏమయ్యాయి..?




అంటూ పరస్పరం ఆరోపణలు, ప్రత్యారోపణలు చేసుకుంటున్నారు. అయితే రాజకీయ పార్టీల మాటలకంటే ప్రజల జీవితాల్లో వచ్చిన మార్పే అసలు కొలమానం. రైతుకు లాభమైందా.?

**యువతకు ఉద్యోగం దొరికిందా.?**

మహిళకు ఆర్థిక భరోసా పెరిగిందా.?

పేద కుటుంబానికి ఇల్లు, విద్య, వైద్యం అందిందా.? గ్రామానికి రోడ్డు, తాగునీరు, సాగునీరు వచ్చాయా.?

ఇలాంటి ప్రశ్నలకు సమాధానాలే ప్రజల తీర్పును ప్రభావితం చేయనున్నాయి.

**'తుంటను ఎత్తేసి.. మొద్దును ఎత్తుకున్న శాస్త్రం'!**

తెలంగాణ రాజకీయాల్లో ప్రజల నోట వినిపిస్తున్న వ్యంగ్య వ్యాఖ్యల్లో ఇదొకటి.

తుంటను ఎత్తేసి.. మొద్దును ఎత్తుకున్న శాస్త్రం అయిపోయింది..! అంటే గత ప్రభుత్వంపై అసంతృప్తితో ప్రజలు కాంగ్రెస్‌కు అవకాశం ఇచ్చారు. ఇప్పుడు కాంగ్రెస్ పాలనపై అసంతృప్తి ఏర్పడితే మళ్లీ బీఆర్ఎస్ వైపు చూస్తారా.? లేక మరో ప్రత్యామ్నాయాన్ని ఎంచుకుంటారా.? అన్నదే రాజకీయ వర్గాల్లో చర్చ.

ఇక్కడ అసలు విషయం పార్టీలు కాదు.. ప్రజల విశ్వాసం. ఒకసారి అధికారంలోకి వచ్చిన పార్టీ ప్రజల అంచనాలను అందుకోకపోతే ప్రజలు మరో పార్టీకి అవకాశం ఇస్తారు. అదే పార్టీ కూడా అంచనాలను అందుకోలేకపోతే మళ్లీ ప్రజలు తమ రాజకీయ నిర్ణయాన్ని మార్చుకుంటారు.

**అందుకే ప్రజాస్వామ్యంలో శాశ్వతంగా ఎవరికీ అధికారం రాసి ఉండదు.**

లిప్రజలు చూస్తున్నది మాటలు కాదు.. పనులు..! లిఎన్నికల సమయంలో ఇచ్చే హామీలు ప్రజల జ్ఞాపకాల్లో ఉంటాయి. అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిలో ఎన్ని అమలు చేశారన్నదే ప్రజల పరిశీలన. ప్రభుత్వం సంబరాలు చేసుకుంటే ప్రజలు కూడా అదే స్థాయిలో సంతోషంగా ఉన్నారా...?

ప్రతిపక్షం ప్రభుత్వం విఫలమైందంటే ప్రజలు కూడా అదే అభిప్రాయంలో ఉన్నారా..?

అన్నది ఎన్నికల సమయంలోనే స్పష్టమవుతుంది.!

అంతవరకు మాత్రం అధికార--ప్రతిపక్ష పార్టీలు ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకోవచ్చు. సవాళ్లు విసురుకోవచ్చు. సభలు నిర్వహించవచ్చు. భారీ కార్యక్రమాలు చేపట్టవచ్చు.

కానీ ప్రజల తీర్పు మాత్రం రాజకీయ సభల్లో కాదు.. ఓటు పెట్టే రోజునే వెలువడుతుంది.

**సానుభూతి కోసం రాజకీయ ఆపసోపాలు..?**

ప్రస్తుత రాజకీయ పరిస్థితిని గమనిస్తే రెండు శిబిరాలు కూడా ప్రజల్లో తమకు అనుకూల వాతావరణం సృష్టించుకునేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నట్లు కనిపిస్తోంది.

అధికార పక్షం అభివృద్ధి, సంక్షేమం, పాలనా విజయాలను ప్రచారం చేస్తోంది.

ప్రతిపక్షం ప్రభుత్వ వైఫల్యాలు, హామీల అమలు తీరును ప్రశ్నిస్తోంది. ఇద్దరి లక్ష్యం ఒక్కటే ప్రజల విశ్వాసాన్ని తిరిగి సంపాదించుకోవడం.

అయితే ప్రజలు మాత్రం గత అనుభవాలను, ప్రస్తుత పరిస్థితులను బేరీజు వేసుకుంటున్నారు.

**ఎవరు ఎక్కువగా మాట్లాడారు.? కంటే**

ఎవరు ఎక్కువగా చేశారు..? అన్నదే ప్రజలకు ముఖ్యమవుతోంది. చివరికి.. ప్రజలదే శాస్త్రం..!

తుంట కావచ్చు.. మొద్దు కావచ్చు.. ఏ పార్టీ అయినా ప్రజల కోసం పనిచేస్తేనే ప్రజలు ఆదరిస్తారు. గతాన్ని తవ్వడం ద్వారా భవిష్యత్తు నిర్మాణం కాదు. గత ప్రభుత్వ తప్పులను చూపించడం ఒక్కటే ప్రస్తుత ప్రభుత్వానికి విజయపత్రం కాదు. ప్రస్తుత ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపడం ఒక్కటే ప్రతిపక్షానికి ప్రజల మద్దతును తెచ్చిపెట్టదు.

ప్రజలకు కావాల్సింది మాటల యుద్ధం కాదు.. పని. సవాళ్లు కాదు.. పరిష్కారాలు.

**సంబరాలు కాదు.. ఫలితాలు.**

వెయ్యి రోజుల రాజకీయ రచ్చలో అధికార పక్షం విజయోత్సవాలు చేసుకుంటోంది.. ప్రతిపక్షం పోరుబాట పడుతోంది. కానీ ఈ రెండు శిబిరాల మధ్య నిలబడి ఉన్న ప్రజలు మాత్రం ప్రశాంతంగా ఒక్కటే అడుగుతున్నారు.?

తుంటను ఎత్తేసి మొద్దును ఎత్తుకున్నాం.. ఇక మరోసారి ఎవరిని ఎత్తుకోవాలి..?

ఆ ప్రశ్నకు సమాధానం రాజకీయ నాయకుల దగ్గర లేదు. ప్రజల ఓటు దగ్గరే ఉంది.



## మండల విద్యుత్ సబ్ స్టేషన్ ఎదుట అర్ధరాత్రి గ్రామస్థుల ధర్నా

**గద్వాల , సెప్టెంబర్ 3 :**

విద్యుత్ అధికారుల నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ కొత్తపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని గ్రామస్థులు మాచర్ల విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద అర్ధరాత్రి ధర్నా నిర్వహించి సబ్ స్టేషన్‌ను ముట్టడించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు, నాయకులు మాట్లాడుతూ.. గ్రామంలో నిరంతరం విద్యుత్ కోతలు విధించడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఆకాశంలో మబ్బులు వేసినా, సన్నపాటి గాలి వీచినా, చినుకులు పడినా వెంటనే విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నారని తెలిపారు. పక్కనే ఉన్న ఇతర గ్రామాలకు, ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉంటున్నా, మల్లంపల్లి, కొత్తపల్లి గ్రామాలకు మాత్రం కరెంట్ పునరుద్ధరించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని మండిపడ్డారు. రాత్రి వేళల్లో కనీసం సింగిల్ ఫేజ్ విద్యుత్ కూడా ఇవ్వకపోవడంతో దోమలు, పాములు, విషకీటకాల భయంతో పిల్లలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన చెందారు. స్థానికంగా ఉన్న లైన్ మెన్లకు వయసు పైబడటంతో పనుల్లో ఆలస్యం జరుగుతోందని, యువకులైన సిబ్బందిని కేటాయించాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయిందని పేర్కొన్నారు. విద్యుత్ సమస్యల పరిష్కారానికి గ్రామస్థుల పరంగా అవసరమైన కూలీలను, ఇతర సహాయ సహకారాలను అందించేందుకు సిద్ధంగా ఉన్నామని, ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి విద్యుత్ లైన్లను పునరుద్ధరించాలని కోరారు. తమ సమస్యపై విద్యుత్ ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి, విద్యుత్ లైన్లను సరిచేసి క్రమం తప్పకుండా విద్యుత్ సరఫరా పునరుద్ధరించాలని, లేనిపక్షంలో నిరసనను మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

## మంత్రివర్గం నుంచి కొండా సురేఖ ఔట్

మొదటి పేజీ తరువాయి...

కొండా సురేఖ.. ఆ వ్యాఖ్యలకు తనకు ఎలాంటి సంబంధం లేదని తెలిపారు. ఆ వ్యాఖ్యలకి తాను బాధ్యురాలిని కాదని క్రమశిక్షణా కమిటీ ముందు వివరణఇచ్చారు. తనపై అవినీతి ఆరోపణలు లేవి సురేఖ వివరణ ఇచ్చినా.. క్రమశిక్షణా కమిటీ సంతృప్తి చెందలేదు. సుస్మిత వ్యాఖ్యలు పార్టీ ప్రతిష్టకు భంగం కలిగిందని తక్షణమే మంత్రివర్గం నుంచి తొలగించాలని ఏకగ్రీవంగా తీర్మానించి నివేదికను ఢిల్లీకి పంపింది.

హస్తినకు చెందిన పంచాయితీ : తరువాత దిల్లీ వేదికగా హైడ్రామా సాగింది. సీఎం రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్ హస్తినలో పార్టీ హైకమాండ్‌తో సమావేశమయ్యారు. పార్టీలో క్రమశిక్షణే ముఖ్యమని కఠిన చర్యలు తీసుకోకపోతే పార్టీలో తిరుగుబాట్లు పెరుగుతాయని అధిష్ఠానం పెద్దలకు నివేదించారు. దిల్లీ వెళ్లిన కొండా సురేఖ కూడా ఖర్గేను కలిసి తన వాదన వినిపించారు.

తాను బీసీ సామాజికవర్గానికి చెందిన వారమని తమ కుటుంబానికి పెద్ద ఓటుబ్యాంక్ ఉందని చెప్పుకొచ్చారు. అయినా శాంతించని హైకమాండ్ రాజీనామా చేయాలని స్పష్టంచేసింది. సురేఖ అందుకు అంగీకరిచకపోవటంతో సీఎం రేవంత్ నేరుగా కొండా సురేఖను బర్తరఫ్ చేయాలని సిఫార్సు చేస్తూ గవర్నర్‌కి లేఖ పంపారు.

"నన్ను బర్తరఫ్ చేయడాన్ని ఖండిస్తున్నా. నిర్ణయానికి ముందు నా వివరణ తీసుకోవాల్సింది. నా కుమార్తె వ్యాఖ్యలకు నన్నెలా బాధ్యురాలిని చేస్తారు?. నా కుమార్తె స్వతంత్ర మహిళ ఆమె వ్యాఖ్యలు ఆమెవే" – కొండా సురేఖ

కీలక పదవుల్లో మార్పులు : రాష్ట్ర ప్రభుత్వం రెండు కీలక పదవుల్లో కూడా మార్పులు చేసింది. సిట్టింగ్ ఎమ్మెల్యే టి. మేఘారెడ్డిపై చేసిన వ్యాఖ్యల కారణంగా ప్రణాళికా సంఘం ఉపాధ్యక్ష పదవి నుండి జి.చిన్నారెడ్డిని తొలగించి, ఆ స్థానంలో హైదరాబాద్ మాజీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మిని నియమించారు. అలాగే, తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ నూతన చైర్‌పర్సన్‌గా నేరెళ్ల శారద నియమితులయ్యారు.

## కేబినేట్‌లో బీసీ వర్గానికి ప్రాధాన్యత

**హైదరాబాద్, సెప్టెంబర్ 3:**

రాష్ట్ర ప్రభుత్వం రెండు కీలక పదవుల్లో కూడా మార్పులు చేసింది. ప్రణాళికా సంఘం ఉపాధ్యక్ష పదవి నుండి జి. చిన్నారెడ్డిని తొలగించి, ఆ స్థానంలో హైదరాబాద్ మాజీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మిని నియమించారు. అలాగే, తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ నూతన చైర్‌పర్సన్‌గా నెరెళ్ల శారద నియమితులయ్యారు. తెలంగాణ కాంగ్రెస్‌లో క్రమశిక్షణకు సంబంధించిన వివాదం నడుస్తున్న తరుణంలో ఈ పరిణామాలు చోటుచేసుకున్నాయి. సిట్టింగ్ ఎమ్మెల్యే టి. మేఘా రెడ్డిపై చేసిన వ్యాఖ్యల కారణంగా చిన్నారెడ్డి కూడా విమర్శల పాలయ్యారు. కొండా సురేఖ తన పైన చర్యల సమయంలో బీసీ కార్డు తెర మీదకు తెచ్చారు. దీంతో.. చిన్నారెడ్డి పైనా చర్యలు వెంటనే తీసుకున్నారు. ఇదే సమయంలో బీసీ వర్గానికి ప్రాధాన్యత ఇస్తూ వీరి స్థానం లో కొత్త నియామకాలు చేపట్టారు. చిన్నారెడ్డి స్థానంలో సీనియర్ నేత కేకే కుమార్తె గద్వాల విజయ లక్ష్మికి ప్లానింగ్ బోర్డు వైస్ ఛైర్మన్ గా బాధ్యతలు అప్పగించారు. తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా నెరెళ్ల శారద ను నియమిస్తూ నిర్ణయం తీసుకున్నారు. సురేఖ ను బర్తరఫ్ చేయటం తో ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన మాజీ రాజ్యసభ సభ్యురాలు గుండు సుధారాణిని కాకతీయ అర్బన్ డెవలప్ మెంట్ అథారిటీ (కుడా) ఛైర్ పర్సన్ గా నియమించారు. ఇక.. సురేఖ స్థానంలో కేబినెట్ లోకి బీసీ వర్గానికి చెందిన మహిళకు అవకాశం ఇవ్వనున్నారు. ఈ స్థానంలో కొత్త మంత్రి గా ఎవరికి అవకాశం దక్కుతుందనేది ఆసక్తి గా మారింది. ఇక.. ఢిల్లీ కేంద్రంగా జరిగిన చర్చల్లో వీరిద్దరి పైనా చర్యలు తీసుకోవాలని రేవంత్ పట్టు బట్టినట్లు తెలుస్తోంది. ఫలితంగా హైకమాండ్ ఆమోదంతో వేటు వేసారు.

## దేశభక్తిలో మోదీ, అమిత్ షాలకు ఒవైసీ బ్రదర్స్ తక్కువేమీ కాదు

మొదటి పేజీ తరువాయి...

అభివృద్ధిపై తాను అసదుద్దీన్, అక్బరుద్దీన్‌తో చర్చించినట్లు తెలిపారు.

**గత ప్రభుత్వంపై విమర్శలు**

సైదాబాద్ స్టీల్ బ్రిడ్జికి గత ప్రభుత్వం కొబ్బరికాయ కొట్టిందే తప్ప ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని రేవంత్‌రెడ్డి విమర్శించారు. తాను ముఖ్యమంత్రి అయిన తర్వాతే పనులు ముందుకు సాగాయని చెప్పారు. ఇన్నేళ్లలో ఎంతమంది ముఖ్యమంత్రులు ఓల్డ్‌సిటీకి వచ్చారో చెప్పాలని ప్రశ్నించారు. పాతబస్తీ గల్లీల్లోకి తాను తప్ప మరెవరూ రాలేదన్నారు.

**అసద్ చెప్పిన పనులకు వెంటనే అనుమతులు**

ఓల్డ్‌సిటీ అభివృద్ధి కోసం అసదుద్దీన్ ఏది సూచించినా వెంటనే పరిశీలించి మంజూరు చేయాలని జీహెచ్ఎంసీ కమిషనర్‌ను ఆదేశిస్తున్నట్లు రేవంత్ చెప్పారు. పాతబస్తీలో పేదలకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. హైదరాబాద్‌లో లక్ష ఇళ్లు నిర్మించి ఇవ్వడమే తమ లక్ష్యమన్నారు. పెద్దలు ఆక్రమించిన భూములను స్వాధీనం చేసుకుని పేదలకు ఇళ్లు నిర్మిస్తామని తెలిపారు.

**హిందూ, ముస్లింలు కలిసి ఉండాలి**

ముస్లింలకు నాలుగు శాతం రిజర్వేషన్ ఇచ్చింది వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వమేనని రేవంత్‌రెడ్డి గుర్తుచేశారు. రాష్ట్రంలో హిందువులు, ముస్లింలు కలిసి మెలిసి ఉండాలని ఆకాంక్షించారు.

# నడిచే విజ్ఞాన సర్వస్వం సారామపెల్లి మల్లారెడ్డి

## - జాతీయ రైతు నేత మల్లారెడ్డి సంతాప సభలో ఎమ్మెల్యేలు, జాతీయ నాయకులు





**వరంగల్, సెప్టెంబర్ 3 (భద్రాద్రిన్యూస్ ):** పీడిత ప్రజల విముక్తి కోసం నిత్య పరిశోధకుడు, పరిశీలకుడు, నడిచే విజ్ఞాన సర్వస్వం సారంపెల్లి మల్లారెడ్డి అని ఎమ్మెల్యేలు, పలువురు జాతీయ, రాష్ట్ర నాయకులు కొనియాడారు. హనుమకొండ జిల్లా కేంద్రం పొద్దుటూరు గార్డెన్ లో సిపిఎం హనుమకొండ జిల్లా కార్యదర్శి జి ప్రభాకర్ రెడ్డి అధ్యక్షతన గురువారం జరిగిన జాతీయ రైతు సంఘం నాయకులు, సిపిఎం నాయకులు సారంపెల్లి మల్లారెడ్డి సంతాప సభలో సిపిఎం పార్టీ పొలిటి బ్యూరో సభ్యులు బి.వి. రాఘవులు, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్, మాజీ మేయర్ డాక్టర్ టి రాజేశ్వర్ రావు, సిపిఎం కేంద్ర కమిటి సభ్యులు ఎస్. వీరయ్య రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి. నాగయ్య, ఎంసిపిఐ రాష్ట్ర కార్యదర్శి గాదెగోయిన రవి, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వెంకట్రాములు, విసికె పార్టీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ జిలుకర శ్రీనివాస్, వ్యవసాయ కార్మిక సంఘం అఖిల భారత ప్రధాన కార్యదర్శి బి వెంకట్, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, తెలంగాణ రైతు సంఘం అధ్యక్షులు పోతినేని సుదర్శన్, సిపిఎం రాష్ట్ర నాయకులు జి. రాములు కుల వివక్ష పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు స్కైలాబ్ తదితరులు పాల్గొని ప్రసంగించారు. రైతాంగ సమస్యలపై, భూ సమస్యలను, జల సమస్యలను, విద్యుత్తు సమస్యలపై నిరంతర అధ్యయనం చేసి ప్రజలను చైతన్యం చేయడంలో జీవితాంతం పోరాటం చేసిన మల్లారెడ్డి వయసులో పెద్దవారు అయినా ఆలోచనలో యువకుడని, చీకటి బతుకుల్లో వెలుగులు నింపే దివిటీగా పని చేశారని అన్నారు. భూమి సమస్యపై, రైతాంగ సమస్యల మీద నిరంతరం పోరాటాలు చేసేది కమ్యూనిస్టులేనని, అలాంటి వారిలో ముందున్న వ్యక్తి సారంపల్లి మల్లారెడ్డి అని అన్నారు. 1956లో సుందరయ్య అన్ని ప్రాంతాలు సస్యశ్యామలం కోసం తిరిగారని, ప్రాజెక్టు, కాలువలు కమ్యూనిస్టులు పోరాటం వల్ల వచ్చాయని అన్నారు. మల్లారెడ్డి గ్రామంలో సర్పంచ్ గా గెలిచి అన్ని సౌకర్యాలు కల్పించారని, కమ్యూనిస్టులు లేని ప్రాంతాలు వెనకబడి ఉన్నాయని, దక్షిణ రాష్ట్రాలు అభివృద్ధి చెందాయి అంటే కమ్యూనిస్టుల వలనేనని అన్నారు. మల్లారెడ్డి చివరి వరకు పార్టీ కోసం పని చేశారని, ప్రజల్లో ఉంటే ఆరోగ్యంగా ఉంటామని మల్లారెడ్డి ఎప్పుడూ చెబుతుండేవారని, ఆయన పోలీస్ పటేల్ గా ఉండి ప్రజలకు సేవ చేయడం సాధ్యంకాదని కమ్యూనిస్టుగా మారాడని అన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటమే మల్లారెడ్డి జరిగి అర్పించే నిజమైన నివాళి అన్నారు. కేసులు, హత్యలు, నిర్బంధాలను తట్టుకొని నిలబడ్డారని, కుటుంబాన్ని పార్టీలో భాగం చేశారని, నిరంతరం అధ్యయనం చేసి సమాచారాన్ని ప్రజా సంఘాలకు అందించే వారని అన్నారు. శాసన సభలో ఏం మాట్లాడాలని అంశంపై సలహాలు, సూచనలు ఇచ్చేవారని, సాధారణ జీవితం గడిపారని, అందరితో స్నేహంగా వ్యవహరించే వారని అన్నారు. రాజ్యాంగాన్ని దిక్కరించేలా పాలక వర్గాలు వ్యవహరిస్తున్నాయని, ప్రజాసమస్యల పరిష్కారం కోసం పోరాటమే మార్గం అని, అదే మార్గాన్ని మల్లారెడ్డి అనుసరించారని అన్నారు. ఆయ ఆయన చనిపోయేంతవరకు ప్రజల మనిషిగా జీవించారని అన్నారు. వరంగల్ జిల్లాలో సాగునీరు సాగునీరు కోసం రైతాంగ సమస్యల కోసం నిరంతరం ఉద్యమాలు నడిపిన వ్యక్తిని జిల్లాలో ఇండ్లు లేని పేదలను సమీకరించి వేలాదిమంది పేదలకి ప్రభుత్వ స్థలాల్లో గుడిసెలు వేయించి ఇండ్ల స్థలాలు ఇప్పించిన ఘనత సారంపల్లి మల్లారెడ్డి స్ఫూర్తి అందరికీ ఆదర్శమని ఆయన బాటలో



కొనసాగించాలని వారు అన్నారు.

అధ్యయనం, ఆచరణ, ఆందోళన, పోరాటం కలగలిపిన విప్లవకారుడు మల్లారెడ్డి అని అన్నారు. పేదలకు భూములుండాలని, పేదల భూములు లాక్కోవడానికి చేసే ఏ చర్యనైనా వ్యతిరేకించాలని మల్లారెడ్డి అనే వారని, ఆయన నిత్య విద్యార్థిగా అధ్యయనం చేయడంతో పాటు నిత్యం బోధించి ఉద్యమకారులకు ఎంతో జ్ఞానాన్ని అందించారని అన్నారు. తన జీవిజాతాన్ని, కుటుంబాన్ని త్యాగం చేసిన మల్లారెడ్డి సేవలు చాలా గొప్పవని అన్నారు. సాగునీటి వనరుల అభివృద్ధి, ఉపయోగం గూర్చి శాస్త్రీయంగా చర్చించి వాటి అమలు కోసం నిరంతరం పనిచేసేవారని, ప్రజా పోరాటాల ద్వారానే పీడిత ప్రజలకు విముక్తి జరుగుతుందని నిత్యం బోధించే వాడని, ఉభయ తెలుగు రాష్ట్రాల్లో మల్లారెడ్డి మరణం తర్వాత వస్తున్న చర్చపై అన్ని కమ్యూనిస్టు పార్టీలు దృష్టి సారించాలని అన్నారు. దేశానికి వెన్నుముక లాంటి రైతాంగ సమస్యలపై మల్లారెడ్డి పోరాటాలను కమ్యూనిస్టు పార్టీలు దృష్టి సారించాలని అన్నారు. కమ్యూనిస్టు పార్టీలు ముక్కలు కావడం చాలా బాధాకరమని మల్లారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారని అన్నారు. ఆయన ఆశయ సాధన కోసం కమ్యూనిస్టులు ఐక్యం కావాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు టి. సాగర్, గోపు జయపాల్ రెడ్డి, వివిధ సంఘాల నాయకులు రవీందర్ రెడ్డి, సూడి కృష్ణా రెడ్డి, ఎన్. అశోక్ స్టాలిన్, డాక్టర్ విజయలక్ష్మి, చంద్రా రెడ్డి, సిహెచ్ రంగయ్య, వాసుదేవ రెడ్డి, రాగుల రమేష్, చుక్కయ్య, బొట్ల చక్రపాణి, టి ఉప్పలయ్య, గొడుగు వెంకట్, తిరుపతి, ఉడుత రవీందర్, సోమిడి శ్రీనివాస్, శోభన్, సాంబరాజు, బంధు సాయిలు, ఆముదాల మల్లారెడ్డి, జానా రెడ్డి, న్యాయవాదులు శ్రీనివాస రావు, మధుసూదన్ రెడ్డి, వేణుగోపాల్, సాయిని నరేందర్ లతోపాటు వందలాది మంది కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు

# దళితుల మనోభావాలను దెబ్బతీసే చర్యలను సహించేది లేదు

## - బీజేపీ కార్యాలయంపై దాడి, సంత్ రవిదాస్ చిత్రపటాలపై నల్లరంగు ఘటనపై నిరసన
## - నిందితులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసులు నమోదు చేయాలి: ఎస్సీ మోర్చా




**కొత్తగూడెం, సెప్టెంబర్ 3 (భద్రాద్రి న్యూస్):** దళితుల మనోభావాలను దెబ్బతీసే విధంగా ఎవరైనా ప్రవర్తిస్తే సహించేది లేదని బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు చాపలమడుగు రాకేష్ బాబు అన్నారు. బీజేపీ రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు, జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి ఆదేశాలతో గురువారం కొత్తగూడెంలోని పోస్ట్ఆఫీస్ సెంటర్‌లో ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాకేష్ బాబు మాట్లాడుతూ.. బీజేపీ రాష్ట్ర కార్యాలయంపై కాంగ్రెస్ కార్యకర్తలు దాడి చేశారని, ఈ ఘటనలో దళితుల ఆరాధ్య దైవంగా భావించే సంత్ శిరోమణి రవిదాస్ చిత్రపటాలపై నల్లరంగు పూయడం జరిగిందని ఆరోపించారు. ఈ చర్య దళిత సామాజిక వర్గం మనోభావాలను తీవ్రంగా దెబ్బతీసిందన్నారు. ఈ ఘటనకు బాధ్యులైన వారిని గుర్తించి, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసులు నమోదు చేసి దళితుల ఆత్మగౌరవాన్ని కాపాడాలని పోలీసులను కోరారు. రాష్ట్ర హోంమంత్రి రేవంత్‌రెడ్డి ఈ ఘటనకు నైతిక బాధ్యత వహించి దళితులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

**ఎస్సీ డిక్లరేషన్‌పై శ్వేతపత్రం విడుదల చేయాలి**

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రకటించిన ఎస్సీ డిక్లరేషన్‌లోని హామీల అమలుపై శ్వేతపత్రం విడుదల చేయాలని రాకేష్ బాబు డిమాండ్ చేశారు. ఏ హామీ అమలైంది, ఏది అమలు కాలేదు, ఆయా హామీలకు ఎంతమేర నిధులు కేటాయించారనే వివరాలను ప్రజల ముందు ఉంచాలని కోరారు. దళిత విద్యార్థుల భవిష్యత్తుకు విద్యే ప్రధాన ఆధారమని, పేద దళిత విద్యార్థులకు సంబంధించిన పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. దళితుల అభ్యున్నతికి బీజేపీ కృషి చేస్తోందని ఆయన పేర్కొన్నారు. దళిత సామాజిక వర్గానికి చెందిన మహనీయులను అవమానించే చర్యలు పునరావృతమైతే బీజేపీ ఎస్సీ మోర్చా తీవ్రంగా ప్రతిఘటిస్తుందని హెచ్చరించారు. తెలంగాణలో భవిష్యత్తులో బీజేపీ ఆధ్వర్యంలో డబుల్ ఇంజన్ ప్రభుత్వం ఏర్పడుతుందనే విశ్వాసాన్ని ఆయన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు సముద్రాల గాయత్రి, ఎస్సీ మోర్చా జిల్లా నాయకులు సంకినేని చంటిరాజు, చర్ల రమేష్, జెరిపోతుల సాత్విక్, కోగిళ్ల శ్రీను, వోంగూరి రాంమూర్తి, మహంకాళి శంకర్, నల్లగట్ల తిరుపతయ్య, సమ్మయ్య, మహేశ్వరి యశ్వంత్, బర్ల శ్రీనివాస్, సిరపంగి రామకృష్ణ, లింగయ్య, సంకినేని రుద్ర, కాల్వ ప్రసాద్, గోర్ల రాజయ్య, బెజ్జంకి సతీష్, సంతోష్, ప్రణిత్ తదితరులు పాల్గొన్నారు.

# గ్యాస్, గుండెపోటు మధ్య తేడా ఏంటి?

## ఈ విషయాలు తెలుసుకోండి




**ఇంటర్నెట్ డెస్క్:** ఛాతీలో మంట, నొప్పి లేదా అసౌకర్యం కనిపించినప్పుడు చాలామంది దాన్ని గ్యాస్ సమస్యగా భావిస్తుంటారు. ముఖ్యంగా అజీర్తి, కడుపు ఉబ్బరం, వికారం వంటి లక్షణాలు ఉంటే గ్యాస్ట్రిక్ సమస్యేనని అనుకుంటారు. అయితే ఇలాంటి లక్షణాలు కొన్ని సందర్భాల్లో గుండెకు సంబంధించిన సమస్యల్లోనూ కనిపించవచ్చని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. అందుకే ఛాతీలో అసౌకర్యం కలిగినప్పుడు కారణాన్ని నిర్ధారించకుండా నిర్లక్ష్యం చేయడం ప్రమాదకరమని సూచిస్తున్నారు.

**గ్యాస్ సమస్య ఎలా ఉంటుంది?**

గ్యాస్ట్రిక్ సమస్య ఉన్నప్పుడు సాధారణంగా పొట్ట పైభాగంలో అసౌకర్యం, ఛాతీ కింది భాగంలో నొప్పి లేదా మంట కనిపించవచ్చు. కడుపు ఉబ్బినట్లు అనిపించడం, తేన్పులు రావడం, అజీర్తి వంటి సమస్యలు కూడా ఉండొచ్చు. అయితే కేవలం లక్షణాలను బట్టి ఇది గ్యాస్ సమస్యేనని ఖచ్చితంగా చెప్పడం సాధ్యం కాదు.

**గుండెపోటు లక్షణాలు ఎలా ఉంటాయి?**

గుండెకు రక్తప్రసరణ తగ్గినప్పుడు ఛాతీలో బిగుతుగా, భారంగా లేదా ఒత్తిడిగా అనిపించవచ్చు. కొందరిలో ఛాతీ నొప్పితో పాటు వికారం, తల తిరగడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, చెమటలు పట్టడం వంటి లక్షణాలు కనిపించవచ్చు. కొన్ని సందర్భాల్లో గుండె సమస్య లక్షణాలు అజీర్తి లేదా గ్యాస్ సమస్యను పోలి ఉండే అవకాశం ఉంది. అందుకే ఛాతీ నొప్పిని కేవలం గ్యాస్ అని భావించి ఇంట్లోనే ఉండిపోవడం సరికాదని నిపుణులు చెబుతున్నారు.

**ఎవరు మరింత అప్రమత్తంగా ఉండాలి?**

వయసు పెరిగేకొద్దీ గుండె సంబంధిత సమస్యలపై జాగ్రత్త అవసరం. ముఖ్యంగా మధుమేహం, అధిక రక్తపోటు, అధిక కొలెస్ట్రాల్, ధూమపానం, కుటుంబంలో గుండె జబ్బుల చరిత్ర వంటి అంశాలు ఉన్నవారు ఛాతీ సంబంధిత లక్షణాలను తేలిగ్గా తీసుకోకూడదు. ఛాతీలో కొత్తగా లేదా తీవ్రమైన నొప్పి రావడం, నొప్పి తగ్గకుండా కొనసాగడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, చల్లటి చెమటలు, మూర్ఛ లేదా తీవ్రమైన బలహీనత వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే అత్యవసర వైద్య సహాయం తీసుకోవాలి.

**గుండెను ఆరోగ్యంగా ఉంచుకోవాలంటే..**

రోజువారీ జీవనశైలిలో కొన్ని మార్పులు చేసుకోవడం గుండె ఆరోగ్యానికి ఉపయోగపడుతుంది.

అధికంగా నూనె, ఉప్పు, చక్కెర ఉండే ఆహారాన్ని తగ్గించాలి.

తరచుగా జంక్‌ఫుడ్ తీసుకునే అలవాటును తగ్గించుకోవాలి.

ధూమపానం, పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలి.

మద్యపానం విషయంలోనూ జాగ్రత్తగా ఉండాలి.

మధుమేహం, అధిక రక్తపోటు ఉంటే వైద్యుల సూచనల ప్రకారం నియంత్రణలో ఉంచుకోవాలి.

తాజా పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు, తృణధాన్యాలు, గింజలు వంటి పోషక పదార్థాలను ఆహారంలో భాగం చేసుకోవాలి.

అవసరానికి అనుగుణంగా కార్బోహైడ్రేట్ల పరిమాణాన్ని నియంత్రించాలి.

క్రమం తప్పకుండా శారీరక వ్యాయామం చేయాలి.

రోజూ తగినంత నిద్ర పొందాలి.

# విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలే భవిష్యత్‌కు పునాది

## - శ్రీ చైతన్య కొత్తగూడెం--1 బ్రాంచ్‌లో ఘనంగా ఇన్వెస్టిచర్ సెరిమనీ
## - బాధ్యత, క్రమశిక్షణ, సమయపాలన, నిజాయితీతో మంచి నాయకులుగా ఎదగాలి: ఏజీఎం వీరన్న




**లక్ష్మీదేవి పల్లి, సెప్టెంబర్ 3 (భద్రాద్రి న్యూస్):** విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందించడంతో పాటు వారిని బాధ్యతాయుతమైన, ఆదర్శవంతమైన నాయకులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా శ్రీ చైతన్య పాఠశాల కొత్తగూడెం--1 బ్రాంచ్‌లో ఇన్వెస్టిచర్ సెరిమనీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏజీఎం వీరన్న విద్యార్థులను ఉద్దేశించి నాయకత్వం, నాయకత్వ లక్షణాలపై విలువైన ప్రసంగం చేశారు. మంచి నాయకుడిగా ఎదగాలంటే బాధ్యత, క్రమశిక్షణ, సమయపాలన, ఆత్మవిశ్వాసం, నిజాయితీతో పాటు ఇతరులను ప్రోత్సహించే గుణం కలిగి ఉండాలని సూచించారు. ప్రతి విద్యార్థి తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ ఇతరులకు ఆదర్శంగా నిలవాలని ఆయన అన్నారు. నాయకత్వం అంటే కేవలం పదవి కాదని, బాధ్యతను స్వీకరించి సమాజానికి ఉపయోగపడే విధంగా పనిచేయడమే నిజమైన నాయకత్వమని వివరించారు. పాఠశాల ప్రిన్సిపాల్ కల్యాణి మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవడం భవిష్యత్‌లో ఉన్నత స్థాయికి ఎదగడానికి దోహదపడుతుందని అన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో ముందుకు సాగుతూ తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని సూచించారు. కార్యక్రమంలో డీన్, పి పి టి, ప్రైమరీ ఇన్‌చార్జ్, ఏవో ప్రవీణ్ తో పాటు పాఠశాల సిబ్బంది పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. విద్యార్థుల్లో నాయకత్వ స్ఫూర్తిని పెంపొందించి, బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దే దిశగా నిర్వహించిన ఇన్వెస్టిచర్ సెరిమనీ కార్యక్రమం అందరినీ ఆకట్టుకుంది.

# రాధకు నీవేగా ప్రాణం..

## - పలు పాఠశాలల్లో ఘనంగా ముందస్తు శ్రీ కృష్ణాష్టమి సంబరాలు
## - రాధా గోపికల వేషధారణలో చిన్నారులు..







**కొత్తగూడెం అర్బన్, సెప్టెంబర్ 3 (భద్రాద్రిన్యూస్):** శ్రీ కృష్ణాష్టమి పురస్కరించుకొని గురువారం పలు పాఠశాలలో ముందస్తు సంబరాలు అంబరాన్ని అంటాయి. పాఠశాలల విద్యార్థులు చిన్నారులు కృష్ణ శ్రీకృష్ణ గోపికల వేషధారణలతో అబ్బురపరిచారు. విద్యార్థులతో ఉట్టికొట్టే కార్యక్రమాన్ని పాఠశాలకు సంబంధించిన అధ్యాపక సిబ్బంది నిర్వహించారు. చుంచుపల్లి మండలం విద్యానగర్ కాలనీ పంచాయతీ పరిధిలోని రామ్ నగర్ ప్రాంతానికి చెందిన ఎస్సార్ డీజీ పాఠశాలలో జరిగిన కృష్ణాష్టమి వేడుకలకు కొత్తగూడెం మున్సిపల్ మేయర్ మూడ్ గణేష్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. బాల్యంలోనే విద్యార్థులకు పండగల ప్రాచుర్యాన్ని తెలియజేస్తూ సంబంధిత పండుగ విశిష్టతను వివిధ వేషధారణలతో తెలియజేయడం అధ్యాపక బృందం చేసిన కృషి అభినందనీయమని తెలిపారు. శ్రీకృష్ణుడికి రాధా అంటే పంచప్రాణాలని వాళ్ళ ప్రేమ నిదర్శనం ప్రపంచానికి తెలిసే విధంగా శ్రీకృష్ణ అష్టమి వేడుకల సందర్భాన్ని తెలియజేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఆర్డిజి ప్రిన్సిపాల్ అధ్యాపక బృందం, సెయింట్ మేరీస్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు అధ్యాపక బృందం పాల్గొన్నారు

# న్యూ విజన్ కాన్సెప్ట్ స్కూల్లో ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు






**ఖమ్మం, సెప్టెంబర్ 3 ( భద్రాద్రి న్యూస్ ప్రతినిధి):** న్యూ విజన్ కాన్సెప్ట్ స్కూల్ ప్రాంగణంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఎంతో భక్తిశ్రద్ధలతో, కన్నులపండువగా నిర్వహించారు. పాఠశాల విద్యార్థులు శ్రీకృష్ణుడు, రాధల వేషధారణలో అలరించి, సాంస్కృతిక కార్యక్రమాలతో అందరినీ ఆకట్టుకున్నారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.డి. ఆబాద్ అలీ జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ -- “భగవద్గీతలో శ్రీకృష్ణుడు అందించిన సందేశం, జీవితంలో ధర్మాన్ని పాటించడం మరియు కర్తవ్యాన్ని నిర్వహించడం నేటి విద్యార్థులకు ఎంతో మార్గదర్శకం అన్నారు.”చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలతో వేదికపై ప్రదర్శించిన నృత్యాలు, అలరించాయి. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు ఇలాంటి పండుగ వేడుకలు ఎంతో దోహదపడతాయి” అని ఆనందం వ్యక్తం చేశారు. విద్యార్థులు కోలాటాలు, సాంస్కృతిక ప్రదర్శనలతో ప్రాంగణాన్ని కృష్ణమయం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అకాడమిక్ డైరెక్టర్ సిహెచ్ కార్తీక్, సిహెచ్ స్ఫూర్తి, పాఠశాల ఉపాధ్యాయులు, మరియు విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని దిగ్విజయం చేశారు.

# లండన్ బ్రిడ్జ్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించిన డాక్టర్ మట్టా దయానంద్ విజయ్ కుమార్





**సత్తుపల్లి, సెప్టెంబర్ 3: ( భద్రాద్రి న్యూస్ ప్రతినిధి):** సత్తుపల్లి పట్టణంలోని కాకరపల్లి రోడ్డులో ఏర్పాటు చేసిన లండన్ బ్రిడ్జ్ ఎగ్జిబిషన్‌ను గురువారం రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయ్ కుమార్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గాదె చెన్నకేశవరావు, వార్డు కౌన్సిలర్లు, సత్తుపల్లి పట్టణ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఇల్లందు లో శ్రీ కల్వకుంట్ల చంద్రసేన గుప్తా గారి 107వ జయంతి వేడుకలు





**ఖమ్మం, సెప్టెంబర్ 3 ( భద్రాద్రి న్యూస్ ప్రతినిధి):** వాసవి క్లబ్ వ్యవస్థాపకులు, స్వాతంత్ర్య సమరయోధులు శ్రీ కె.సి. గుప్తా గారి 107వ జయంతి సందర్భంగా వాసవి ఇంటర్నేషనల్ క్లబ్ ఆదేశాల మేరకు చేపట్టిన ఏడు రోజుల సేవా కార్యక్రమాల్లో భాగంగా మొదటి రోజు వాసవి క్లబ్ ఇల్లందు ౘ వనిత క్రౌన్ ఇల్లందు అధ్యక్షులు కటకం సత్యేంద్ర కుమార్ మరియు కటకం అలేఖ్య గార్ల ఆధ్వర్యంలో సిల్వర్ స్టార్ KCGF దాతల సన్మాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఎచ్ సిల్వర్ స్టార్ KCGF అర్వపల్లి రాధాకృష్ణ గారిని ఘనంగా సన్మానించి, స్వీట్లు తినిపించి ఆత్మీయంగా అభినందించారు.అర్వపల్లి రాధాకృష్ణ గారు మాట్లాడుతూ కె.సి. గుప్తా గారి సేవా స్ఫూర్తి, ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జోన్ చైర్మన్ బోనగిరి రవి కిరణ్ గారు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. అలాగే కటకం సత్యేంద్ర కుమార్, కటకం అలేఖ్య, తీర్దాల నాగరాజు, సముద్రాల ఉషారాణి, తీర్దాల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ ఆధ్వర్యంలో కొత్తగూడెం ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా





**కొత్తగూడెం అర్బన్, సెప్టెంబర్ 03 (భద్రాద్రి న్యూస్) :** కాంగ్రెస్ సర్కార్ అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా కొత్తగూడెం ఆర్డీవో కార్యాలయం ఎదుట గురువారం బీఆర్ఎస్ శ్రేణులు ఆందోళనకు దిగారు. 22ఏ ద్వారా నిషేధిత జాబితాలో పెట్టిన ప్రైవేట్ భూములను అందులో నుంచి విడుదల చేయాలని, రామవరం ప్రాంత వాసులకు పొజీషన్ సర్టిఫికెట్లు జారీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ 1000 రోజుల పాలనా వైఫల్యాలను నిరసిస్తూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.టీ.రామారావు పిలుపు మేరకు రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి వనమా వెంకటేశ్వర రావుల సూచనల మేరకు ఈ ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వందలాదిగా పాల్గొన్న బీఆర్ఎస్ శ్రేణులు గులాబీ కండువాలు ధరించి, జెండాలు, ప్లకార్డులు చేతబట్టి రేవంత్ రెడ్డి అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ పెద్ద పెట్టున నినాదాలు చేసారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు హయాంలో 76 జీవో ప్రకారం కొత్తగూడెం మునిసిపాలిటీలో 10వేల మంది పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వడం జరిగిందని మాజీ మున్సిపల్ చైర్మెన్ సీతామహాలక్ష్మీ, మాజీ వైస్ చైర్మెన్ వేల్పుల దామోదర్ తెలిపారు. ఆ జీవో ప్రకారం సిద్ధంగా ఉన్న 4వేల పట్టాలను వెంటనే పేదలకు పంపిణీ చేయాలని వారు డిమాండ్ చేశారు. అదేవిధంగా రామవరం ప్రాంత వాసులు ఇండ్లు కొనుక్కోలేక, అవసరాలకు అమ్ముకునే వీలులేక ఇబ్బందులు పడుతున్నారని, వారికి వెంటనే పొజీషన్ సర్టిఫికెట్లు జారీ చేయాల్సిందిగా ఆర్డీవోకు ఇచ్చిన వినతిపత్రంలో పేర్కొన్నారు. "అబద్ధపు హామీలతో అధికారం-1000 రోజులుగా కాంగ్రెస్ మోసం","అమలు కాలేదు ఒక్క గ్యారంటీ-హస్తం పతనానికి మాది గ్యారంటీ", "ఆరు గ్యారంటీ లు ఎగ్గొట్టిన రేవంత్-నిన్ను ఇంటికి పంపడం మా వంతు" అని రాసిన ప్లకార్డులు ప్రదర్శిస్తూ పెద్ద పెట్టున నినాదాలిచ్చారు. ఈ ఆందోళన కార్యక్రమంలో మునిసిపల్ కార్పొరేషన్ కార్పోరేటర్ సాగర్ మల్హోత్రా, మాజీ కౌన్సిలర్లు బండారు రుక్మాంగధర్, అంబుల వేణుగోపాల్, నాయకులు ముద్దంగుల మహేష్, ఏమునరి శివ కృష్ణ, జూనూరి రాజేష్, ఖాజాభక్ష్, మాదాసు పద్మ, ధీకొండ సునీత, మనోజ్, జానీ, కాళీ, సచిన్, అమర్, సిద్ధూ, సుందర్, సురేందర్, చంద్రయ్య, సుధీర్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# రత్నమ్మ సేవలు మరువలేనివి...

**- భారీగా హాజరైన అభిమానులు**

**- జ్ఞాపకాలను నెమరు వేసుకున్న ప్రముఖులు**



**పాలేరు, సెప్టెంబర్ 3 (భద్రాద్రి న్యూస్):** స్థానిక సెంట్ మేరీస్ ఫంక్షన్ హాల్ లో బుధవారం జరిగిన వడిగ రత్నమ్మ సంస్మరణ సభలో పలువురు వక్తలు మాట్లాడుతూ ఆమె జ్ఞాపకాలు నెమరు వేసుకున్నారు. దాట్ల, తట్టుపల్లి, తోడేలగూడెం, సుబ్లేడ్, వేదనాయకపురం, తదితర గ్రామాల్లో విద్యా సేవలతో పాటు వైద్య సేవలు అందించారు. కనీస సౌకర్యాలు లేని రోజుల్లో విద్య వైద్య యొక్క ప్రాముఖ్యతను కళారూపాల ద్వారా బుర్రకథ, హరికథ వీధి నాటకాల ద్వారా సమాజాన్ని చైతన్య పరిచారు. గ్రామీణ ప్రాంతంలో రాత్రివేళ అక్షర దీపం ఏకపాత్ర అభినయం ద్వారా ఎంతోమంది నిరక్షరాశులను అక్షరాసులుగా తీర్చిదిద్దిన ఘనత రత్నమ్మకే దక్కుతుందని పలువురు పేర్కొన్నారు. ఆనాటి విద్యార్థులకు చదువు చెప్పడం ద్వారా నేడు డాక్టర్లుగా, ఇంజనీర్లుగా, ప్రభుత్వ ఉపాధ్యాయులుగా, లాయర్లుగా, రాజకీయవేత్తలుగా తమ వృత్తుల్లో రాణిస్తున్నామని తెలియజేశారు. రేవఆర్ ఇజ్రాయిల్ రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రత్నమ్మ భౌతికంగా దూరమైన ఆమె సేవలు ఎన్నటికీ మరువలేనివని పలువురు తెలిపారు. తనకు నలుగురు సంతానాన్ని సమాజ సేవ కోసం పెద్ద కుమారుడు రెండో కుమారుడు, కుమార్తెను వైద్యరంగంలో, చిన్న కుమారుడు విద్యారంగంలో రత్నమ్మ స్థిరపరిచారు. తల్లి జ్ఞాపకాల్లో జ్ఞాపకం చేసుకుంటూ సభా ప్రాంగమంతా భావుద్వేగం మధ్య కొనసాగింది. ఈ కార్యక్రమంలో రెవరెండ్ ఆర్ ఇజ్రాయిల్ రెడ్డి, విశ్రాంతి పాస్టర్ రేవయాదాల వేదరత్నం, పల్ల రాజశేఖర్, వడిగ కుటుంబీకులు, బంధువులు, విద్యార్థులు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

# రైతు సమస్యలను వెంటనే పరిష్కరించాలి



**కొత్తగూడెం అర్బన్, సెప్టెంబర్ 03 (భద్రాద్రి న్యూస్) :** కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని పేర్కొంటూ బీఆర్ఎస్ పార్టీ చేపట్టిన ఏడు రోజుల నిరసన కార్యక్రమాల్లో భాగంగా గురువారం చుంచుపల్లి మండలం విద్యానగర్ కాలనీ బైపాస్ వద్ద రైతు సదస్సు నిర్వహించారు. కాంగ్రెస్ పాలనలో తెలంగాణ వ్యవసాయరంగం ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ఈ సదస్సు నిర్వహించినట్లు బీఆర్ఎస్ నాయకులు తెలిపారు. ముఖ్యంగా రైతు బీమా, యూరియా--విత్తనాల సరఫరా, ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బాదావత్ శాంతి, సొసైటీ డైరెక్టర్ వేల్పుల మల్లేష్ యాదవ్, సీనియర్ నాయకులు తోగారు రాజశేఖర్, మండల పార్టీ అధ్యక్షుడు ముత్యాల రాజేష్, సర్పంచులు బలరాం, శ్రీకాంత్ నాయక్, రాందాస్ నాయక్, ఉప సర్పంచ్ రతన్ నాయక్‌తో పాటు మాజీ సర్పంచులు ధనలక్ష్మి, మోతి, గుమ్మడి సాగర్, రంగరాజు రాజేశ్, శ్రీకాంత్ యాదవ్, నవతన్, రామంచి శ్రీనివాస్, బోనగిరి శ్రీకాంత్, తాతారావు, కలకోటి ఐలయ్య, కంటే రవి, మాలోత్ రాజా, శ్రీహరి, సంకుబాపన అనుదీప్, దుర్గేష్ పాల్గొన్నారు.

# వైరాలో ఘనంగా కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలన వేడుకలు

**- వైరా పట్టణ అధ్యక్షులు వీరంశెట్టి సీతారాములు ఆధ్వర్యంలో వేడుకలు**





**వైరా, సెప్టెంబర్ 3, (భద్రాద్రి న్యూస్) :** వైరా నియోజకవర్గ పట్టణ మున్సిపాలిటీ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో గురువారం కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలన వేడుకలను వైరా పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు వీరంశెట్టి సీతారాములు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి ఘనంగా వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజా ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేసుకుంటూ ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమం, రైతు సంక్షేమం, మహిళా సాధికారత, యువతకు ఉపాధి, విద్య, వైద్యం, గృహ నిర్మాణం వంటి రంగాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ ముందుకు సాగుతుంది అని అన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ అభయహస్తం హామీలను ఆచరణలోకి తీసుకు వస్తున్న ప్రజా ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అని పేర్కొన్నారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, 500 కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రైతు రుణమాఫీ, రైతు భరోసా, రాజీవ్ యువ వికాసం, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తూ అన్ని వర్గాల ప్రజలకు అండగా నిలుస్తుందని తెలిపారు. వైరా నియోజకవర్గ అభివృద్ధికి కూడా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తుందని వైరా పట్టణంలో వంద పడకల ఆసుపత్రి నిర్మాణం, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్, మౌలిక వసతుల అభివృద్ధి వంటి అనేక కార్యక్రమాలకు నిధులు మంజూరు చేయటం ఎందుకు నిదర్శనం అని అన్నారు. ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్న కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వానికి వెయ్యి రోజుల సందర్భంగా వైరా పట్టణ కాంగ్రెస్ తరపున హృదయపూర్వక కృతజ్ఞతలు, అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు శీలం చంద్రశేఖర్ రెడ్డి, మార్క్ ఫెడ్ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, మార్కెట్ కమిటీ చైర్మన్ బోళ్ల గంగారావు, టిపిసిసి ప్రధాన కార్యదర్శి కట్ల రంగారావు, డాక్టర్ కాపా మురళీకృష్ణ, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధికార ప్రతినిధి పమ్మి అశోక్, మున్సిపల్ వైస్ చైర్మన్ కట్ల సంతోష్, ఆత్మ కమిటీ చైర్మన్ మట్టూరి వెంకటేశ్వరరావు, జిల్లా కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి దొడ్డ పుల్లయ్య, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ బి డి కే రత్నం, జిల్లా కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి పనితి శ్రీను, సయ్యద్ అన్వర్, నారపోకు రవి, చింతనపు ప్రసాద్, తోటకూర శ్రీకాంత్, వాంకుడోత్ బిఖ్యా, ఏదునూరు శ్రీను, పువ్వాళ్ల రాము, దూరిశెట్టి నరసింహారావు, గుడికి వెంకన్న, తోటకూర వీరబాబు, మండలం నుంచి వచ్చిన సర్పంచులు తదితరులు పాల్గొన్నారు

# ప్రభుత్వ ఆసుపత్రులను సద్వినియోగం చేసుకోవాలి

**- ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లి అప్పుల పాలవద్దు**

**- దిశా కమిటీ సభ్యురాలు, పోలంపల్లి సర్పంచ్ హేమలత బాలాజీ**




**కారేపల్లి, సెప్టెంబర్ 3, (భద్రాద్రి న్యూస్ రాములు ):** ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుబాటులో ఉన్న వైద్య సేవలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఖమ్మం జిల్లా దిశా కమిటీ సభ్యురాలు, పోలంపల్లి గ్రామపంచాయతీ సర్పంచ్ హేమలత బాలాజీ సూచించారు. ప్రజల్లో ప్రభుత్వ వైద్య సేవలపై నమ్మకం పెంచేందుకు ప్రజాప్రతినిధులు సైతం ప్రభుత్వ ఆసుపత్రుల సేవలను వినియోగించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ క్రమంలో సర్పంచ్ హేమలత బాలాజీ భర్త, సహాయ కార్యనిర్వాహక ఇంజినీర్ దారావత్ బాలాజీ స్వయంగా ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి వైద్య సేవలు పొందారు. ప్రజాప్రతినిధులు ప్రభుత్వ ఆసుపత్రులను వినియోగించుకోవడం ద్వారా ప్రజల్లో కూడా ప్రభుత్వ వైద్య సేవలపై మరింత విశ్వాసం పెరుగుతుందని ఆమె పేర్కొన్నారు. ఈ సందర్భంగా హేమలత బాలాజీ మాట్లాడుతూ సాధారణ ఆరోగ్య సమస్యలు ఎదురైనప్పుడు అవసరాన్ని బట్టి ముందుగా సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రిని సంప్రదించాలని కోరారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుబాటులో ఉన్న ఉచిత వైద్య పరీక్షలు, వైద్యుల సలహాలు, మందులు తదితర సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రైవేట్ ఆసుపత్రుల్లో అధిక వైద్య ఖర్చులు భరించలేక అనేక కుటుంబాలు అప్పులు చేసి ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నాయని అన్నారు. అవసరం లేని సందర్భాల్లో ఖరీదైన ప్రైవేట్ వైద్యాన్ని ఆశ్రయించి అప్పుల భారాన్ని పెంచుకోవద్దని, ముందుగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో లభించే వైద్య సేవలను వినియోగించుకోవాలని కోరారు. ప్రభుత్వ ఆసుపత్రులు కేవలం పేదల కోసమే కాదని, ప్రతి పౌరుడికి అందుబాటులో ఉన్న ప్రజారోగ్య వ్యవస్థ అని హేమలత బాలాజీ స్పష్టం చేశారు. ప్రభుత్వ వైద్య సేవలపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పోలంపల్లి తండా గ్రామ శాఖ అధ్యక్షుడు గూగులోత్ నవీన్ నాయక్, గూగులోత్ భాస్కర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# చిన్ని కృష్ణుల సందడితో మాంటిసోరి పాఠశాల కళకళ!

**- కృష్ణాష్టమి వేడుకల్లో ఆకట్టుకున్న చిన్నారుల వేషధారణలు**

**- రాధా--గోపికలతో పండుగ శోభ.. పాటలు, నృత్యాలతో అలరించిన విద్యార్థులు**



**సింగరేణి, సెప్టెంబర్ 3,( భద్రాద్రి న్యూస్ రాములు ):** శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు సింగరేణి మండలంలోని మాంటిసోరి పాఠశాలలో ఘనంగా జరిగాయి. చిన్నారుల కృష్ణలీలలతో పాఠశాల ప్రాంగణం సందడిగా మారింది. బాలకృష్ణుడి వేషధారణలో ముస్తాబైన చిన్నారులు చూపిన సందడి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కృష్ణుడు, రాధ, గోపికల వేషధారణల్లో చిన్నారులు మురిపిస్తూ వేడుకలకు మరింత వన్నె తెచ్చారు. సంప్రదాయ దుస్తుల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని జన్మాష్టమి విశిష్టతను తెలియజేసే పాటలు, నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. చిన్నారుల చిలిపి చేష్టలు, బాలకృష్ణుడి వేషధారణలు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, పండుగల విశిష్టతను చిన్నారులకు తెలియజేయడమే ఇలాంటి కార్యక్రమాల ప్రధాన ఉద్దేశమన్నారు. పాఠ్యాంశాలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మకత, ఆత్మవిశ్వాసం, సామాజిక నైపుణ్యాలు పెంపొందుతాయని తెలిపారు. వేడుకల్లో పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొని చిన్నారులను ప్రోత్సహించారు. బాలకృష్ణుల వేషధారణలు, రాధా--గోపికల సందడి, పాటలు, నృత్యాలతో మాంటిసోరి పాఠశాల ప్రాంగణం పండుగ వాతావరణాన్ని తలపించింది.

# ఫారం పాండ్ పనులకు సర్పంచ్ భూక్యా రంజిత్ కుమార్ శంకుస్థాపన

**- వర్షపు నీటి నిల్వతో భూగర్భ జలాల పెంపు.. కూలీలకు ఉపాధి**

**- ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలి: సర్పంచ్**



**కారేపల్లి, సెప్టెంబర్ 3(భద్రాద్రి న్యూస్ రాములు ):** కారేపల్లి మండలం గాదెపాడు గ్రామపంచాయతీ పరిధిలో రైతు గలిగా వెంకటేశ్వర్లు వ్యవసాయ క్షేత్రంలో ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టనున్న ఫారం పాండ్ (ఇంకుడు గుంత) నిర్మాణ పనులకు గాదెపాడు సర్పంచ్ భూక్యా రంజిత్ కుమార్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కొబ్బరికాయ కొట్టి పనులను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ భూక్యా రంజిత్ కుమార్ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా చేపడుతున్న ఫారం పాండ్ నిర్మాణ పనులతో గ్రామీణ కూలీలకు ఉపాధి లభించడంతో పాటు వర్షపు నీటిని నిల్వ చేసుకునేందుకు అవకాశం ఏర్పడుతుందని తెలిపారు. నీటి నిల్వల ద్వారా భూగర్భ జలాల పెంపునకు కూడా దోహదపడుతుందని పేర్కొన్నారు. గ్రామపంచాయతీ పరిధిలోని ఉపాధి హామీ కూలీలు అందుబాటులో ఉన్న పనులను సద్వినియోగం చేసుకుని ప్రతిరోజూ పనుల్లో పాల్గొని ఉపాధి పొందాలని సర్పంచ్ కోరారు. రైతులు, కూలీలకు ప్రయోజనం చేకూరేలా గ్రామంలో ఉపాధి హామీ పథకం ద్వారా మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టేందుకు కృషి చేస్తామని తెలిపారు. ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా పంచాయతీ తరపున పూర్తి సహకారం అందిస్తామని సర్పంచ్ భూక్యా రంజిత్ కుమార్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వాంకుడోత్ కుమార్, ఫీల్డ్ అసిస్టెంట్ కేవలం, ఉపాధి హామీ కూలీలు, రైతు గలిగా వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# కార్మిక హక్కుల పరిరక్షణకు ఐక్య పోరాటమే మార్గం

**- టీయూసీఐ రాష్ట్ర జనరల్ కౌన్సిల్‌ను జయప్రదం చేయాలి**

**- కార్మికులు అధిక సంఖ్యలో తరలిరావాలి: ధరావత్ సక్రునాయక్**




**కారేపల్లి, సెప్టెంబర్ 3, (భద్రాద్రి న్యూస్ రాములు ):** కార్మికుల హక్కులు, సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందని టీయూసీఐ కారేపల్లి--కామేపల్లి ఏరియా కార్యదర్శి ధరావత్ సక్రునాయక్ అన్నారు. సెప్టెంబర్ 6న ఖమ్మంలోని రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించనున్న టీయూసీఐ తెలంగాణ రాష్ట్ర జనరల్ కౌన్సిల్‌ను కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర జనరల్ కౌన్సిల్‌ను విజయవంతం చేయాలని కోరుతూ గురువారం కారేపల్లి మండలం మాదారం స్టీల్ ప్లాంట్‌లో టీయూసీఐ ఆధ్వర్యంలో ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికులను ఉద్దేశించి ధరావత్ సక్రునాయక్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా కార్మిక వర్గం అనేక సమస్యలను ఎదుర్కొంటోందన్నారు. కార్మికుల హక్కులు, ప్రయోజనాలకు భంగం కలిగించేలా కేంద్ర ప్రభుత్వం నాలుగు కార్మిక చట్టాలను తీసుకొచ్చిందని విమర్శించారు.కొత్త కార్మిక చట్టాల అమలుతో కార్మికుల హక్కులు మరింత పరిమితమయ్యే ప్రమాదం ఉందని ఆయన పేర్కొన్నారు. కార్మిక చట్టాల్లో తీసుకొస్తున్న మార్పులు పెట్టుబడిదారీ వర్గానికి అనుకూలంగా ఉన్నాయని ఆరోపించారు. కార్మికుల ప్రయోజనాలను కాపాడేందుకు సంఘటితంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై సమగ్రంగా చర్చించడంతో పాటు భవిష్యత్ పోరాట కార్యాచరణను రూపొందించేందుకు రాష్ట్ర జనరల్ కౌన్సిల్ కీలక వేదికగా నిలుస్తుందని తెలిపారు. రాష్ట్ర జనరల్ కౌన్సిల్‌లో "పెట్టుబడిదారీ సంక్షోభం--కార్మిక వర్గంపై ప్రభావం" అనే అంశంపై రాజకీయ విశ్లేషకులు, విద్యావేత్త వి.వి. రమణరావు, టీయూసీఐ జాతీయ ఉపాధ్యక్షులు వనమాల కృష్ణ, రాష్ట్ర అధ్యక్షులు కేసూర్యం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.ఎల్. పద్మ, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వెంకట్‌రెడ్డి, జి. రామయ్య తదితరులు ప్రసంగించనున్నట్లు తెలిపారు. కార్మికుల సమస్యల పరిష్కారంతో పాటు వారి హక్కుల పరిరక్షణకు నిరంతరం పోరాడాల్సిన అవసరం ఉందని ధరావత్ సక్రునాయక్ అన్నారు. కార్మికులు పెద్ద సంఖ్యలో ఖమ్మానికి తరలివచ్చి రాష్ట్ర జనరల్ కౌన్సిల్‌ను విజయవంతం చేయాలని కోరారు. ఈ ప్రచార కార్యక్రమంలో శివ, చందూలాల్, వీరన్న, బిక్కు, లాలు, సంతు, నవీన్, రవి తదితరులు పాల్గొన్నారు.

# భాగ్యనగర్ తండా సమస్యల పరిష్కారానికి సర్పంచ్ హీరాలాల్ ప్రత్యేక చొరవ

**- పాలకవర్గ సమావేశంలో వార్డుల వారీగా సమస్యలపై చర్చ**
**- మినిట్స్ పుస్తకంలో నమోదు.. పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచన**

**సింగరేణి, సెప్టెంబర్ 3,( భద్రాద్రి న్యూస్ రాములు ):** భాగ్యనగర్ తండా గ్రామపంచాయతీ పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు సర్పంచ్ బానోత్ హీరాలాల్ ప్రత్యేక చొరవ తీసుకున్నారు. గ్రామపంచాయతీ పాలకవర్గ సమావేశంలో వార్డుల వారీగా సమస్యలను ప్రస్తావించి, వాటిని పంచాయతీ కార్యదర్శి సమక్షంలో మినిట్స్ పుస్తకంలో నమోదు చేయించారు. 4వ వార్డులో భూక్యా తోప్య ఇంటి వద్ద పైప్‌లైన్ మరమ్మతులు చేపట్టి మోరి ఏర్పాటు చేయాలని, వాంకుడోత్ శంకర్ ఇంటి వద్ద మూలలో ఉన్న పాత మోరిని సరిచేయాలని కోరారు. లావుడ్య నగేష్ కిరాణా దుకాణం సమీపంలోని ప్రభుత్వ బావిని పూడ్చివేయడంతో పాటు గుగులోత్ కిషన్ ఇంటి వద్ద ఉన్న ప్రభుత్వ బావి పరిస్థితిని పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. వార్డు పరిధిలో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని, తులస్య ఇంటి నుంచి శంకర్ ఇంటి వరకు ఉన్న కచ్చా కాలువను శుభ్రం చేయాలని కోరారు. 3వ వార్డులో విద్యుత్ సమస్యలతో పాటు వీధి దీపాల సమస్యను పరిష్కరించాలని సూచించారు. 2వ వార్డులో చెత్త సేకరణ వాహనం సక్రమంగా రావడం లేదని, దీంతో పారిశుద్ధ్య సమస్యలు ఏర్పడుతున్నాయని, చెత్త వాహనం క్రమం తప్పకుండా వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. 5వ వార్డులో బాధావత్ జేత్రం ఇంటికి వెళ్లే దారి సమస్యను పరిష్కరించాలని, 6వ వార్డులో అంగన్వాడీ కేంద్రానికి సంబంధించిన సమస్యలను పరిష్కరించాలని సూచించారు. 7వ వార్డులో తారాచంద్ ఇంటికి వెళ్లే దారిని మెరుగుపరచాలని కోరారు. 8వ వార్డులో భూక్యా బాలాజీ ఇంటి వెనుక ఖాళీ స్థలంలో మురుగునీరు నిల్వ ఉండటంతో స్థానికులకు ఇబ్బందులు కలుగుతున్నాయని, మురుగునీరు నిల్వ కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. 9, 10, 11వ వార్డుల్లో



నెలకొన్న మంచినీటి సమస్యలను పరిష్కరించి ప్రజలకు తాగునీరు సక్రమంగా అందేలా చర్యలు చేపట్టాలని, 12వ వార్డులో బోరింగ్ సమస్యను పరిష్కరించాలని పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా సర్పంచ్ బానోత్ హీరాలాల్ మాట్లాడుతూ గ్రామపంచాయతీ పరిధిలోని ప్రతి వార్డులో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడమే తమ లక్ష్యమన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటికి ప్రాధాన్యత క్రమంలో పరిష్కారం చూపేందుకు పాలకవర్గం కృషి చేస్తుందని తెలిపారు. మంచినీరు, పారిశుద్ధ్యం, విద్యుత్, వీధి దీపాలు, డ్రైనేజీ, రహదారులు, అంగన్వాడీ వంటి మౌలిక సమస్యలకు ప్రాధాన్యతనిస్తూ సంబంధిత అధికారుల సహకారంతో పరిష్కారం చూపుతామని సర్పంచ్ హీరాలాల్ పేర్కొన్నారు. ప్రజల సమస్యలను మినిట్స్ పుస్తకంలో నమోదు చేయించి అధికారికంగా పరిష్కార ప్రక్రియను ముందుకు తీసుకెళ్లడం ద్వారా గ్రామాభివృద్ధికి మరింత వేగం తీసుకువస్తామని తెలిపారు.

# పల్లె దవాఖానాలు ప్రజల పాలిట వరం

**- వైద్యాధికారిణి డాక్టర్ ఎం. రిషిత**




**కామేపల్లి, సెప్టెంస్త్రబర్ 3 (భద్రాద్రి న్యూస్):-** పల్లె దవాఖానాల ద్వారా గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి వస్తున్నాయని,ఇవి ప్రజల పాలిట వరప్రసాదమని వైద్యాధికారిణి డాక్టర్ ఎం. రిషిత అన్నారు. ఖమ్మం జిల్లా కామేపల్లి మండల పరిధిలోని కొత్తలింగాల కాలనీలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రిషిత మాట్లాడుతూ, గ్రామీణులకు నాణ్యమైన వైద్యాన్ని త్వరితగతిన అందించడమే పల్లె దవాఖానాల ప్రధాన లక్ష్యమని తెలిపారు.రాబోయే సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న ఉచిత వైద్య సేవలు, మందులను ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ?ఈ కార్యక్రమంలో ఏఎన్ఎమ్‌లు సిహెచ్. ముంతాజ్, బి. సునీత, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసరావు ఇతర వైద్య సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# శిరీషకు న్యాయం చేయాలి..



**- నిందితుడికి కఠిన శిక్ష పడాల్సిందే**
**- సర్పంచ్ గుగులోత్ వరలక్ష్మి రాజు ఆధ్వర్యంలో ఉసిరికాయలపల్లిలో కొవ్వొత్తుల ర్యాలీ**
**- 'తుడుం దెబ్బ' ఆధ్వర్యంలో భారీ నిరసన..**
**- గిరిజన ఆడబిడ్డల భద్రతకు పటిష్ట చర్యలు తీసుకోవాలని డిమాండ్**

**కారేపల్లి, సెప్టెంబర్ 3, (భద్రాద్రి న్యూస్ రాములు ):**హైదరాబాద్ సమీపంలోని తుక్కుగూడలో దారుణ హత్యకు గురైన గిరిజన యువతి, నర్సు ఊకే శిరీషకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ సింగరేణి మండలం ఉసిరికాయలపల్లి గ్రామపంచాయతీలో ఆదివాసీ హక్కుల పోరాట సమితి 'తుడుం దెబ్బ' ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ, నిరసన కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ గుగులోత్ వరలక్ష్మి రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆదివాసీ నాయకులు, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

**శిరీషకు న్యాయం జరిగే వరకు పోరాటం**

ఈ సందర్భంగా సర్పంచ్ గుగులోత్ వరలక్ష్మి రాజు మాట్లాడుతూ.. సమాజానికి సేవ చేయాలనే లక్ష్యంతో నర్సుగా పనిచేస్తున్న గిరిజన యువతి శిరీష దారుణ హత్యకు గురికావడం తీవ్రంగా బాధాకరమన్నారు. శిరీష కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలిచి, బాధిత కుటుంబానికి సంపూర్ణ న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 'తుడుం దెబ్బ' నాయకులు ఉండం శ్రీనివాస్ మాట్లాడుతూ.. గిరిజన ఆడబిడ్డపై జరిగిన దారుణ ఘటనను తీవ్రంగా ఖండించారు. నిందితుడిపై కేసును వేగంగా విచారించి చట్టప్రకారం కఠిన శిక్ష పడేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

**గిరిజన మహిళలకు రక్షణ కల్పించాలి**

భవిష్యత్తులో మరే గిరిజన ఆడబిడ్డకు ఇలాంటి అన్యాయం జరగకుండా ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టాలని నిరసనకారులు డిమాండ్ చేశారు. గిరిజన మహిళలు, యువతుల భద్రతకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించి శిరీషకు నివాళులర్పించారు. శిరీష ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, బాధిత కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా నిలవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక పంచాయతీ ప్రజలు, ఆదివాసీ సంఘాల ప్రతినిధులు, మహిళలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

# మదన్‌లాల్ ఆశయాల బాటలో మనీషా లక్ష్మి..

**- వైరాలో బీఆర్ఎస్ కార్యక్రమాలకు జోరుగా ప్రచారం**
**- ప్రజల మధ్య విస్తృత పర్యటనలు.. సమస్యలను తెలుసుకుంటూ ముందుకు సాగుతున్న బానోత్ మనీషా లక్ష్మీమదన్‌లాల్**
**- తండ్రి ఆశయాలను కొనసాగిస్తూ ప్రజా సమస్యలపై దృష్టి**



**కారేపల్లి, సెప్టెంబర్ 3, (భద్రాద్రి న్యూస్ రాములు ):** వైరా నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ నాయకురాలు బానోత్ మనీషా లక్ష్మీమదన్‌లాల్ ప్రజాక్షేత్రంలో విస్తృతంగా పర్యటిస్తున్నారు. మాజీ ఎమ్మెల్యే, దివంగత నాయకుడు బానోత్ మదన్‌లాల్ ఆశయాలను కొనసాగించాలనే లక్ష్యంతో నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో ప్రజలను కలుస్తూ పార్టీ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తున్నారు.

**ప్రజల సమస్యలపై దృష్టి**

మనీషా లక్ష్మి గ్రామాల్లో పర్యటించే సమయంలో ప్రజలను కలుసుకుని స్థానికంగా ఉన్న సమస్యలను తెలుసుకుంటున్నారు. నిరుపేదలు, మహిళలు, యువత ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకుంటూ, వాటి పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని భరోసా కల్పిస్తున్నట్లు బీఆర్ఎస్ నాయకులు తెలిపారు. "నాన్న ఆశయాల సాధనే నా లక్ష్యం.. ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తా" అని మనీషా లక్ష్మి పేర్కొంటున్నట్లు పార్టీ శ్రేణులు తెలిపారు.

**మహిళలు, వృద్ధులతో ఆత్మీయంగా మమేకం**

గ్రామాల పర్యటనల్లో మహిళలు, వృద్ధులు, యువతతో మనీషా లక్ష్మి ఆత్మీయంగా మాట్లాడుతున్నారు. వారి సమస్యలను తెలుసుకుంటూ అందుబాటులో ఉండే నాయకురాలిగా కొనసాగేందుకు ప్రయత్నిస్తున్నారని బీఆర్ఎస్ వర్గాలు పేర్కొన్నాయి. మదన్‌లాల్‌తో తమకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ పలువురు ఆమెను ఆత్మీయంగా పలకరిస్తున్నారని తెలిపారు.

**శ్రేణుల్లో నూతనోత్సాహం**

మనీషా లక్ష్మి పర్యటనలతో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తల్లో ఉత్సాహం నెలకొంది. గ్రామస్థాయిలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమన్వయం చేసుకుంటూ పార్టీ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ప్రజా సమస్యలను పార్టీ దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నట్లు బీఆర్ఎస్ నాయకులు తెలిపారు. తండ్రి మదన్‌లాల్ ఆశయాలను ముందుకు తీసుకెళ్తూ ప్రజలతో మమేకమవుతున్న బానోత్ మనీషా లక్ష్మీమదన్‌లాల్ వైరా నియోజకవర్గ రాజకీయాల్లో తనదైన స్థానం కోసం ముందుకు సాగుతున్నారని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

# పట్టుదలతో అనుకున్న లక్ష్యాలను సాధించవచ్చు

**- పీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్- రైట్ ఛాయిస్ ఆధ్వర్యంలో ఫ్రీ పోలీస్ కోచింగ్ క్యాంప్ ప్రారంభోత్సవంలో రాష్ట్ర మంత్రి పొంగులేటి**
**- నిరుద్యోగ అభ్యర్థులకు మధ్యాహ్న భోజన వసతి కూడా కల్పిస్తానని అభయం**



**ఖమ్మం ప్రతినిధి, (భద్రాద్రి న్యూస్): :** పట్టుదలతో ప్రయత్నిస్తే, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగితే.. నేటి నిరుద్యోగ యువతీ, యువకులు భవిష్యత్తులో ఉద్యోగులుగా, అధికారులుగా స్థిరపడొచ్చని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సూచించారు. పొంగులేటి స్వరాజ్యం – రాఘవరెడ్డి ( పీఎస్ఆర్) చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రైట్ ఛాయిస్ నిర్వహణలో నగరంలోని బైపాస్ రోడ్డు లో గల రామకృష్ణ ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన పోలీస్ కానిస్టేబుల్, ఎస్సై ఫ్రీ కోచింగ్ క్యాంప్ ను గురువారం ప్రారంభించారు. కలెక్టర్ దివాకర, తదితర ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులతో కలిసి ప్రసంగిస్తూ.. గతంలో 2016లో 2,300 మందికి ఇలానే శిక్షణ ఇప్పించగా.. 350 మందికి పైగా ఉద్యోగాలకు ఎంపిక అయ్యారని, ఆరోజు..వారి తల్లిదండ్రుల కళ్లలో చూసిన ఆనంద భాష్పాలు తానెప్పటికీ మరువలేనని అన్నారు.

**మీ శీనన్నగా.. అండగా ఉంటా :** మధ్యతరగతి యువతీ యువకుల ఉన్నత భవిష్యత్తు కోసం తన వంతుగా సహకారం అందించేందుకు ఎప్పుడూ సిద్ధంగా ఉంటానని అన్నారు. ఉత్తమ ఫ్యాకల్టీతో, రీజనింగ్ పుస్తకాలతో ఏర్పాటు చేసిన ఈ ఫ్రీ కోచింగ్ క్యాంప్ ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నిరుద్యోగ అభ్యర్థులెవరికీ ఇబ్బంది కలగకుండా.. మధ్యాహ్న భోజన వసతి కూడా కల్పిస్తున్నట్లు ప్రకటించారు. రైట్ చాయిస్ నిర్వాహకులు.. మెండెం కిరణ్ కుమార్ కృషి, తనతో ఉన్న అనుబంధం మరువలేనిదని మంత్రి పొంగులేటి గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా కోచింగ్ కోసం ప్రత్యేకంగా రూపొందించిన పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో..: మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, ఏదులాపురం మున్సిపల్ చైర్ పర్సన్ పోకబత్తిని అనిత, వైస్ చైర్మన్ తమ్మినేని నవీన్, మార్కెట్ కమిటీ చైర్మన్ వి. సీతారాములు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు బొర్రా రాజశేఖర్, అడిషనల్ డీసీపీ రామానుజం, ఐఏఎస్ ట్రైనర్ ఆకెళ్ళ రాఘవేంద్రరావు, రీజనింగ్ ఫ్యాకల్టీ రమణ, తదితరులు పాల్గొన్నారు.

# వాణి వివేకానంద విద్యాలయం లో ఘనంగా శ్రీ కృష్ణాష్టమి వేడుకలు





**వైరా, సెప్టెంబర్ 3,( భద్రాద్రి న్యూస్ ):** వైరా నియోజకవర్గ పట్టణ మున్సిపాలిటీ వాని వివేకానంద విద్యాలయంలో శ్రీ కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిపారు. పాఠశాల ప్రిన్సిపాల్ వాణి ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలలో ముందుగా చిన్నారులతో శ్రీకృష్ణుని వేషధారణలో ఉట్టి కొట్టే వేడుకను పాఠశాల కరస్పాండెంట్ కోటేశ్వరరావు ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ శ్రీ కృష్ణాష్టమి జన్మదిన వేడుకలు తమ పాఠశాలలో ప్రతి సంవత్సరం జరుపుతామని శ్రీకృష్ణుడి ఆశీర్వాదాలు తమ పిల్లలపై ఎల్లప్పుడూ కలిగి ఉండాలని వారు తెలిపారు. అంతేకాకుండా సమాజంలో మార్పు రావాలని, మానవతా విలువలు క్షీణించిపోతున్న తరుణంలో, ఆ భగవంతుని దీవెనలు అందరిపై సమాజంపై ఉండాలని, ముఖ్యంగా బాల్యంపై, బాల బాలికలపై పాఠశాల పిల్లలపై శ్రీకృష్ణుని దీవెనలు ఉండాలని వారు తెలిపారు, అనంతరం విద్యార్థులతో అటహాసంగా ఉట్టి కొట్టే వేడుకను జరిపారు, గోపికల వేషధారణలో ఉన్న ఆడపిల్లలతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు, ఈ కార్యక్రమంలో పాఠశాల కన్వీనర్ గింజుపల్లి జనార్ధన్, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# ఖమ్మంలో ఘనంగా కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పండగ





**వైరా, సెప్టెంబర్ 3, ( భద్రాద్రి న్యూస్):** ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం కాంగ్రెస్ పార్టీ వెయ్యి రోజుల పాలన దిగ్విజయంగా పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డిసిసి అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై పార్టీ నాయకులతో కలిసి కేక్ కట్ చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ వేడుకల్లో ఖమ్మం జిల్లా ఆర్యవైశ్య కార్పొరేషన్ ఇన్చార్జ్ గ్రంధి ప్రవీణ్, వైరా నియోజకవర్గ ఆర్యవైశ్య కార్పొరేషన్ ఇంచార్జ్ ఆత్మకూరి శేషగిరిరావు ప్రత్యేకంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజులుగా అద్భుతమైన పాలన అందించిందని కొనియాడారు, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ ప్రభుత్వం ముందుకు సాగుతుందని చెప్పారు, ఖమ్మం జిల్లాను అన్ని రంగాలలో అభివృద్ధి చేసేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా, నియోజకవర్గస్థాయి ముఖ్య నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు పాల్గొని, పరస్పరం మిఠాయిలు తినిపించుకుంటూ సంబరాలు చేసుకున్నారు.

# ఇన్వెస్టిచర్ సెరిమనీ కార్యక్రమం



శ్రీ చైతన్య పాఠశాల, కొత్తగూడెం-1 బ్రాంచ్‌లిలో ఇన్వెస్టిచర్ సెరిమనీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో *AGM సర్ వీరన్న గారులి పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి లినాయకత్వం (Leadership) మరియు నాయకత్వ లక్షణాలలి గురించి విలువైన ప్రసంగం చేశారు. మంచి నాయకుడిగా ఎదగడానికి బాధ్యత, క్రమశిక్షణ, సమయపాలన, ఆత్మవిశ్వాసం, నిజాయితీ, ఇతరులను ప్రోత్సహించే గుణం వంటి లక్షణాలు ఎంతో అవసరమని వివరించారు. అలాగే లిప్రిన్సిపాల్ శ్రీమతి కల్యాణి మామ్‌లి కూడా నాయకత్వం యొక్క ప్రాముఖ్యతను వివరిస్తూ విద్యార్థులకు ప్రేరణాత్మకంగా ప్రసంగించారు. విద్యార్థులు తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ, ఇతరులకు ఆదర్శంగా నిలవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో లిడీన్ గారు, PPT, ప్రైమరీ ఇన్‌చార్జ్, AO సర్ మరియు ప్రవీణ్ సర్‌లి పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తూ, బాధ్యతాయుతమైన మరియు ఆదర్శవంతమైన నాయకులుగా తీర్చిదిద్దేందుకు ఈ ఇన్వెస్టిచర్ సెరిమనీ ఎంతో ఉపయోగకరంగా నిలిచింది.

# కారేపల్లి క్రాస్‌రోడ్డులో నేడు బీఆర్ఎస్ 'వంటా--వార్పు'

**- కార్యక్రమానికి హాజరుకానున్న వైరా నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకురాలు బానోత్ మనీషా లక్ష్మి మదన్‌లాల్**



**కారేపల్లి, సెప్టెంబర్ 3, (భద్రాద్రి న్యూస్ రాములు ):** బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శుక్రవారం కారేపల్లి మండల కేంద్రంలోని క్రాస్‌రోడ్ వద్ద 'వంటా--వార్పు' కార్యక్రమం నిర్వహించనున్నట్లు పార్టీ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి వైరా నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ నాయకురాలు బానోత్ మనీషా లక్ష్మి మదన్‌లాల్ హాజరుకానున్నారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు కారేపల్లి క్రాస్‌రోడ్ వద్ద కార్యక్రమం ప్రారంభం కానుంది. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మహిళా నాయకురాళ్లు, తాజా మాజీ ప్రజాప్రతినిధులు, పాత్రికేయ మిత్రులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పార్టీ నాయకులు కోరారు. పార్టీ శ్రేణులు సమన్వయంతో ముందుకు సాగి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీఆర్ఎస్ జిల్లా మైనార్టీ నాయకుడు షేక్ గౌసుద్దీన్ పిలుపునిచ్చారు.

# విద్యార్థి దశలో క్రీడలు చాలా కీలకం

**-- మండల అభివృద్ధి అధికారి ధరావత్ సోమలల్ నాయక్**



**కామేపల్లి,సెప్టెంబర్ 3 (భద్రాద్రి న్యూస్):** విద్యార్థినులు చదువుతో పాటు విద్యార్థి దశలోనే క్రీడలు చాలా కీలకమని,ప్రతీ విద్యార్థి క్రీడల్లో రాణించాలని కామేపల్లి ఎంపీడీఓ ధారావత్ సోమలాల్ నాయక్ అన్నారు. ఎస్.జీఎఫ్ మండల స్థాయి అండర్ --17 విభాగాల బాలికల కబడ్డీ,కోకో, వాలీబాల్ క్రీడా పోటీల్లో పొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు.వారికి అవసరమయ్యే నిత్యవసర వస్తువులు బట్టలు ప్లేట్లు బ్యాగులు బెడ్ షీట్లు కార్పెట్లు టవలు గ్లాసులు ఇతర అవసరమైన కిట్లును ఎంపీడీవో చేతుల మీదుగా గురువారం కామేపల్లి ఆశ్రమ ఉన్నత పాఠశాలలో అందజేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ.. క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు దేహదారుఢ్యం పెంపొందిస్తా యన్నారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు సూచించారు.ఈ కార్యక్రమంలో కామేపల్లి గ్రామ సర్పంచ్ బుల్లి హరి నాయక్ పాఠశాల హెచ్ఎం, రఘునాథ్, మ్యాట్రిన్ జి స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు

Printed, Published and Owned by CHENGAPONGUSAIDULU,and printed at KAKATI BABU PRINTERS H No.4-10.Telagarama varam,Laximidevipally, Kothagudem -507101,Dist .Bhadradri kothagudem, Telangana. And Published At HNo. DA-416,Babu camp,chunchupalli (M), Kothagudem-507101,Dist Bhadradri kothagudem, Telangana.Editor: CHENGAPONGU SAIDULU. RNI TELTEL 2023/90682Call No.6302329046